



# విజయభాను






విశాఖపట్నం, మంగళవారం 10-03-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 157 పేజీలు : 8 వెల : 1 రూపాయి

ఎన్నికల పరిశీలకులు వెంటనే

## విధుల్లోకి చేరాలి

- పరిశీలకులుగా ఐఏఎస్‌ల నియామకం
- నిర్భయంగా బాధ్యతలు నిర్వర్తించండి
- పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్



విజయవాడ: ఎన్నికల పరిశీలకులు వెంటనే విధుల్లోకి చేరాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరపున నిర్భయంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల తరువాయి 2లో..

28 నుంచి ఏపీ అసెంబ్లీ

## బడ్జెట్ సమావేశాలు

అమరావతి: ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా గవర్నర్ హరిచందన్.. ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. 2020-2021 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 31న (మంగళవారం) అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేందర్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత అసెంబ్లీ ఎన్ని రోజులు నిర్వహించాలనేది బీఏసీ నిర్ణయిస్తుంది.

ఉన్నత విద్యా వ్యవస్థలో

# నాణ్యతకు పెద్దపీట

- ప్రమాణాలు పాటించని కాలేజీలపై కఠినచర్యలు
- ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లింపునకు సిద్ధంగా ఉన్నాం
- ఉన్నత విద్యపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



తాడేపల్లి: ఉన్నత విద్యా వ్యవస్థలో నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన ఉన్నత విద్యపై సమీక్షించారు. ఈ సమావేశంలో హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి, హయ్యర్ ఎడ్యుకేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర పాల్గొన్నారు. కాలేజీల ఫీజుల ప్రతిపాదనలను ఏపీ హయ్యార్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముఖ్యమంత్రి ముందు ఉంచింది. మనం రూపొందించుకునే విధానాలు.. దీర్ఘకాలం అమలు కావాలని సీఎం పేర్కొన్నారు ప్రమాణాలు పాటించని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

చెల్లింపునకు సిద్ధంగా ఉన్నాం.. ఫీజు రియింబర్స్‌మెంట్ ఎప్పటికప్పుడు చెల్లింపునకు సిద్ధంగా ఉన్నామని సీఎం స్పష్టం చేశారు. గత ఏడాది బకాయిలతో పాటు ఈ ఏడాది మూడు త్రైమాసికాలకు సంబంధించి, ప్రభుత్వం తరపున చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మార్చి 30లోగా చెల్లింపులు చేసేందుకు ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు చెల్లింపులు వల్ల కళాశాలలకు మంచి జరుగుతుందన్నారు.

అందుకే స్థిరమైన ఫీజు విధానం ఉండాలని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసిన వైసీపీ



న్యూఢిల్లీ: రాజ్యసభ అభ్యర్థుల పేర్లను వైసీపీ ఖరారు చేసింది. మంత్రులు మోపిదేవి, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు పారిశ్రామికవేత్త, రాంకీ సంస్థల అధినేత అయోధ్య రామిరెడ్డి పేర్లను ఖరారు చేసింది. ఇక నాలుగో సీటును మరో పారిశ్రామికవేత్త పరిమళ్ నత్వానికి కేటాయించారు. మోపిదేవి, పిల్లి.. ఎమ్మెల్సీలుగా ఎన్నికై మంత్రులుగా కొనసాగుతున్నారు. మండలి రద్దు నిర్ణయం నేపథ్యంలో వీరిద్దరికీ రాజ్యసభ అవకాశం దక్కింది. ఇక అయోధ్య రామిరెడ్డికి గతంలోనే జగన్ మాట ఇచ్చారు. దీంతో ఆ హామీని నెరవేర్చారు.

### సీఎం జగన్‌కు ధన్యవాదాలు పరిమల్ నత్వాని

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీ పరిమల్ నత్వాని ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త ముకేష్ అంబానీ విజ్ఞప్తి మేరకు పరిమల్‌ను ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు నామినేట్ చేస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ నుంచి పెద్దల సభకు నామినేట్ చేసిందుకు సీఎం జగన్‌కు, వైఎస్సార్‌సీపీకి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పరిమల్ ధన్యవాదాలు తెలిపారు. . ఏపీ ప్రజలకు ధన్యవాదాలు. నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవ చేస్తాను అని పోస్ట్ చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త ముకేష్ అంబానీకి అత్యంత సన్నిహితుడైన పరిమల్ నత్వానీ ప్రస్తుతం జార్ఖండ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. త్వరలో అయన రాజ్యసభ పదవీకాలం పూర్తవుకానుంది. ఈ నేపథ్యంలో ఏపీ తరువాయి 2లో..

## రాష్ట్రాభివృద్ధికి సీఎం నిర్ణయాలు భేష్

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీమంత్రి



అమరావతి : టీడీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే అంబటి రాంబాబుతో కలిసి సీఎం జగన్ వద్దకు వెళ్లి పార్టీలో చేరారు. అనంతరం డొక్కా వరప్రసాద్ మాట్లాడుతూ.. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికే వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తరువాయి 2లో..

## సీఎం జగన్‌తో జర్మన్ కాన్సులేట్ జనరల్ భేటీ



తాడేపల్లి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జర్మన్ కాన్సులేట్ జనరల్ క్రిస్టినా మారియా భేటీ అయ్యారు. సోమవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన క్రిస్టినా బృందాన్ని సీఎం జగన్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు. మహిళా సంక్షేమం, విద్యావ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల గురించి చర్చించారు. జర్మన్ ఎడ్యూకేషన్ సిస్టమ్ గురించి సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు.

## రాజ్యసభ ఎన్నికలకు ఏచూరి దూరం



న్యూఢిల్లీ: సీపీఎం పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న రాజ్యసభ ఎన్నికల్లో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పోటీ చేయడం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 6న న్యూఢిల్లీలో జరిగిన సీపీఎం సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రస్తుతం సీపీఎం పొలిట్‌బ్యూరోలో తరువాయి 2లో..

## వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

- ప్రజలు వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలి
- ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి మేలు
- 12న బీజేపీ- జనసేన మేనిఫెస్టో.. కీలక చర్చలు



విజయవాడ : రాష్ట్రంలో ఈ నెలలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 12న తమ పార్టీ మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు బీజేపీ- జనసేన నాయకులు ప్రకటించారు. విజయవాడలో ఇరు పార్టీల ముఖ్య నాయకులు సమావేశమై స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సుమారు రెండు గంటల పాటు చర్చించారు. సమావేశం అనంతరం బీజేపీ నాయకురాలు పురందేశ్వరి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు.

జిల్లా, అసెంబ్లీ, మండల స్థాయిలో ఇరు పార్టీల మధ్య సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తరువాయి 2లో..

## విశాఖ మేయర్ పీఠం వైఎస్సార్‌సీపీదే

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే



అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల ముందు ప్రతిపక్ష టీడీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహమాన్ వైఎస్సార్‌సీపీలో చేరారు. విశాఖ టీడీపీ అర్బన్ అధ్యక్షుడు వ్యవహరించిన రెహమాన్ గత ఏడాది డిసెంబర్ 26న టీడీపీకి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలను స్వాగతిస్తున్నానని అన్నారు. విశాఖపట్నంను ఎగ్జిక్యూటివ్ కాపిటల్ ప్రకటించిన రోజే సీఎం నిర్ణయానికి మద్దతు తెలిపానని గుర్తుచేశారు. తన సతీమణి మద్యపాన నిషేధం కోసం పోరాటం చేశారని.. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేస్తున్న మద్య విధానం వల్ల ఎంతో మేలుచేస్తోందని అభినందించారు. పదవుల కోసం పార్టీలో చేరలేదని మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు చేరారని ఎస్ఏ రెహమాన్ స్పష్టం చేశారు. విశాఖపట్నం మేయర్ పీఠాన్ని ఖచ్చితంగా వైఎస్సార్‌సీపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా విశాఖను తరువాయి 2లో..




# స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో అన్నదానం



చోడవరం : పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్న దానం నిర్వహించారు. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న దానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ శిబిరానికి ఎంపిక




భీమునిపట్నం : స్థానిక ఎస్ వి ఎల్ ఎన్ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులయిన బి. అప్పలరాజు, ఎం.స్వర్ణకళ లు ఎన్ ఎస్ ఎస్ శిబిరంకు ఎంపిక అయ్యారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం తరపున ఎం.స్వర్ణ కళని జార్ఖండ్ రాష్ట్రానికి, అలాగే బి.అప్పల రాజుని సూరం పాలెం ఎన్ ఎస్ ఎస్ శిబిరాలకు ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ టి గ్లోరీ దయా కుమారి తెలియ జేశారు. ఎన్ఎస్ఎస్ శిబిరాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి నాగలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

# సీఎం జగన్ అందరికీ న్యాయం చేస్తారు

- రాజ్యసభ అభ్యర్థిగా తనను ఎంపిక చేయడంపై హర్షం
- మంత్రి మోపిదేవి వెంకటరమణ



గుంటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రాధాన్యత ఇస్తారని మరోసారి రుజువైందని మంత్రి మోపిదేవి వెంకటరమణ అన్నారు. తనను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ..'రాజ్యసభలో రాష్ట్రం కోసం పోరాటం చేయాలని ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూశారు. సీఎం జగన్ మాత్రం బీసీలు ఎదగాలని అవకాశాలు కల్పిస్తున్నారు. చంద్రబాబు రాజ్యసభ సీట్లను డబ్బున్నవాళ్లకు అమ్ముకున్నారు. జగన్ మాత్రం అందరికీ న్యాయం చేశారు. వైఎస్ జగన్‌కు, చంద్రబాబుకు ఉన్న తేడా ఏమిటో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఏ విషయంలో అయినా జగన్ మాట ఇస్తే అది నెరవేర్చుతారు' అని అన్నారు.

# మంచీటి సమస్యను పరిష్కరించాలి యానాం నీరు విడుదల చేయాలి

**జాయింట్లతో చర్చిస్తున్న మంత్రి మల్లాడి ఇతర అధికారులు జిల్లా అధికారులనో కోరిన మంత్రి**

యానాం. మార్చి 9: యానాం నియోజకవర్గంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలిన పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మలాడి కృష్ణారావు కోరారు. ఈ మేరకు జలా కలెకర్, జెసిలను మంత్రి మలాడి కలిసారు. ఈ సందర్భంగా యానాం పరి సితిని వివరించారు. యానాంకు నీటిని విడుదల చేయ్యలని కోరారు. ఈ మేరకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఈ నెల 11వతేదీ నుండి నీటిని విడుదల చేసేందుకు అంగీకరించాన్నారు. మంత్రి మలాడితో పాటు యానాం పరిపాలనాధికారి శివరాజ్మ నా, తదితర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు

శ్రీకాకుళం : జిల్లాలో గ్రామ పంచాయతీల ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటి జె నివాస్ తెలిపారు. ఈ మేరకు సోమ వారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో మొదటి విడత ఎన్నికలను 18 మండలాలు, రెండవ విడత ఎన్నికలను 20 మండలాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 1190 గ్రామ పంచాయతీలకు 1180 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామ పంచాయతీలలో 1122 నాన్ షెడ్యూల్డు ప్రాంతంలోని గ్రామ పంచాయతీలు, 16 షెడ్యూల్డు ప్రాంతంలోని గ్రామ పంచాయతీలు, శత శాతం ఎస్.టి జనభా కలిగిన గ్రామాలు కలిగిన 52 గ్రామ పంచాయతీలు ఉన్నాయని చెప్పారు. షెడ్యూల్డు ఏరియాలో 8 పంచాయతీలు ఎస్.టి మహిళలకు, 8 ఎస్.టి జనరల్ కేటగిరికి వెరశి 16 కేటాయించడం జరిగిందన్నారు. శత శాతం ఎస్.టి జనాభాగల పంచాయతీల్లో 28 ఎస్.టి మహిళలకు, 24 ఎస్.టి జనరల్ కు వెరశి 52., నాన్ షెడ్యూల్డు ప్రాంతాల్లో 30 ఎస్.టి మహిళలకు, 17 ఎస్.టి జనరల్ కు వెరశి 47., 65 ఎస్.సి మహిళలకు, 50 ఎస్.సి జనరల్ కు వెరశి 115., 197 బి.సి మహిళలకు, 190 బి.సి జనరల్ కు వెరశి 387 బి.సిలకు., 276 అన్ రిజర్వుడు మహిళలకు, 297 అన్ రిజర్వుడు జనరల్ కేటగిరికి వెరశి 573 అన్ రిజర్వుడు కేటగిరికి కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. రిజర్వేషన్ ప్రక్రియలో 568 మహిళలకు, 554 జనరల్ కు వెరశి 1122 పంచాయతీలకు ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. షెడ్యూల్డు ప్రాంతంలో 16 గ్రామ పంచాయతీలలోగల 136 వార్డు సభ్యులకు కేటాయించిన సీట్లలో 63 ఎస్.టి మహిళలకు, 64 ఎస్.టి జనరల్ వెరశి 127., 2 ఎస్.సి మహిళలు, 3 అన్ రిజర్వుడు మహిళలు, 4 అన్ రిజర్వుడు జనరల్ కేటగిరి వెరశి 7 వార్డులను కేటాయించారు. మొత్తం 68 మంది మహిళలు, 68 మంది జనరల్ కేటగిరికి కేటాయించినట్లు చెప్పారు. శత శాతం ఎస్.టి జనాభా ఉన్న తండాలలో 209 వార్డులు ఎస్.టి మహిళలకు, 209 వార్డులు ఎస్.టి జనరల్ కేటగిరికి వెరశి 418 ఎస్.టిలకు., నాన్ షెడ్యూల్డు ప్రాంతంలో 284 వార్డులు ఎస్.టి మహిళకు, 180 వార్డులు ఎస్.టి జనరల్ కు వెరశి 464 వార్డులు., 739 ఎస్.సి మహిళలకు, 263 ఎస్.సి జనరల్ కు వెరశి 1002 వార్డులు ఎస్.సిలకు., 1965 బి.సి మహిళలకు, 1895 బి.సి జనరల్ కు వెరశి 3860 బి.సిలకు., 2319 అన్ రిజర్వుడు మహిళలకు, 2969 అన్ రిజర్వుడు జనరల్ కు వెరశి 5288 అన్ రిజర్వుడుగా చేసినట్లు ఆయన వివరించారు. మొత్తం వార్డులలో 5307 మహిళలకు, 5307 జనరల్ కేటగిరికి వెరశి 10614 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిపారు.

**మొదటి దశలో పోలింగు జరిగే గ్రామ పంచాయతీలు**

మొదటి విడతలో 18 మండలాలు - ఆమదాలవలస (30 గ్రామ పంచాయతీలు), ఎచ్చెర్ల (26), జి.సిగడాం(31), గార (25), సరుబుజ్జిలి (21), లావేరు (33), నరసన్నపేట (34), కోటబొమ్మాళి (38), టెక్కలి (27), పలాస (18), మందస (41), ఇచ్ఛాపురం (21), రాజాం (21), ఆర్.ఆమదాలవలస (39), సీతంపేట (53), కొత్తూరు (43), హిరమండలం (23), పాతపట్నం (34) వెరశి 558 గ్రామ పంచాయతీలలో పోలింగు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నివాస్ వివరించారు.

**మొదటి దశలో పోలింగు జరిగే గ్రామ పంచాయతీలు**

రెండవ విడతలో 20 మండలాలు - బూర్జ (30 గ్రామ పంచాయతీలు), శ్రీకాకుళం (23), పొందూరు (29), పోలాకి (31), ఎల్.ఎన్.పేట (22), రణస్థలం (34), జలుమూరు (40), సంతబొమ్మాళి (34), నందిగాం (37), వజ్రపు కొత్తూరు (37), సోంపేట (23), కవిటి (23), కంచిలి (31), సంతకవిటి (34), వంగర (29), వీరఘట్టాం (34), పాలకొండ (32), భామిని (27), సారవకోట (35), మెళియాపుట్టి (37) వెరశి 622 గ్రామ పంచాయతీలకు రెండవ విడతలో పోలింగు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.

# 'బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారు'

అమరావతి: వైసీపీ నేతలు మామూలు మనుషులుగా ప్రవర్తించాలంటే ఎన్నికల్లో ఆ పార్టీకి ఝలక్ ఇవ్వాల్సిందేనని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లు చట్టపరంగా ఎందుకు తగ్గించారో జగన్ సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. జైల్లో పెట్టినా స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని స్పష్టంచేశారు. ఒక్కసారంటూ అడిగారు కదా అని ప్రజలు గెలిపించినందుకు వైసీపీ కండకావరం ప్రదర్శిస్తోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తోందంటూ పలు వీడియోలు ప్రదర్శించిన చంద్రబాబు.. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడుతున్న మంత్రి పెద్దిరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 90శాతం స్థానాలు గెలిపించుకోవడమంటే నిబంధనలు ఉల్లఘించి కండ కావరం ప్రదర్శించటమా? అని సూటిగా ప్రశ్నించారు. లోప భూయిష్ట విధానాలతో బీసీలకు ఎక్కడికక్కడ ప్రాతినిధ్యం తగ్గించారని వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# మున్సిపాలిటీలో వార్డుల నుండి పోటీకి సీపీఐ శ్రేణులు సిద్ధం కండి

## సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

నర్సీపట్నం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నర్సీపట్నం మున్సిపాలిటీ వార్డుల నుండి పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం నర్సీపట్నంలో జరిగిన శాఖ సమావేశంకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి, ప్రజల మద్దతు కోరి ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలన్నారు. జగన్ ప్రభుత్వం దళిత, పేదలు, గిరిజనులకు కేటాయించిన అసైండ్ భూములు లాక్కొని పేదలకు ఇళ్ల స్థలాలను పంచడం విడ్డూరంగా ఉందన్నారు. నర్సీపట్నంలో ఎన్నికలకు ముందు ఇంటి పన్నులు తగ్గిస్తున్నామని ఒక జీవోను తీసుకురావడం ఎన్నికల కోసం తీసుకువచ్చినట్లుగా ఉందన్నారు. సచివాలయాలకు వేసిన వైసిపి పార్టీ రంగులు తక్షణమే మార్పు చేయాలని, ఇవి ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఉన్నాయని ఆయనన్నారు. స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, పార్టీకి అవకాశం ఉన్న చోట అభ్యర్థులను పోటీలో దింపుతామని నర్సీపట్నం 10, 11, 19, 28 వార్డులలో పోటీకి సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజల్లోకి వెళ్లి ఓటు అడగాలని కార్యకర్తలు ఉద్దేశించి అన్నారు. కేంద్రంలో రెండవ సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య కులాల చిచ్చు పెడుతూ ఆర్ఎస్ఎస్ అజెండాను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చి అభివృద్ధి నిరోధక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రుత్తల పెద్దబుజ్జి, ఎం.అప్పలరాజు, శ్రీనివాసచౌదరి, సువల అచ్చిలు, రమణ, దీపు, అచ్చిలు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఎన్నికల పరిశీలకులు వెంటనే విధుల్లోకి చేరాలి

ఎన్నికలను పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో వాలంటీర్ల సేవలు వినియోగించుకోవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ వాట్సాప్ గ్రూప్ ద్వారా సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహిస్తున్నందున బ్యాలెట్ పేపర్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని రమేష్‌కుమార్ సూచించారు.

**ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్‌ల నియామకం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థలకు ఎన్నికల పరిశీలకులుగా 13 జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. వీరితో పాటు మరో నలుగురు ఉన్నతాధికారులను రిజర్వ్‌లో ఉంచారు. జిల్లాల వారీగా వారి వివరాలు.

జ కె. ఆర్.బి. హెచ్. ఎన్. చక్రవర్తి - కర్నూలు జిల్లా
జఎం. పద్మ - కృష్ణ జిల్లా
జ పి.ఉషా కుమారి - తూర్పు గోదావరి జిల్లా
జపి.ఎ. శోభా - విజయనగరం జిల్లా
జకె. హర్షవర్ధన్ - అనంతపురం జిల్లా
జటి. బాబు రావు నాయుడు - చిత్తూరు జిల్లా
జఎం. రామారావు - శ్రీకాకుళం జిల్లా
జకె. శారదా దేవి - ప్రకాశం జిల్లా
జప్రవీణ్ కుమార్ - విశాఖపట్నం జిల్లా
జబి. రామారావు -ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా
జపి. రంజిత్ బాషా - వైయస్ఆర్ కడప జిల్లా
కాంతిలాల్ దండే - గుంటూరు జిల్లా
జహిమాన్షు శుక్లా - పశ్చిమ గోదావరి జిల్లా

వీరికి అదనంగా నలుగురు సీనియర్ ఉన్నతాధికారులను సిహెచ్. శ్రీధర్, జి. రేఖ రాణి, టి.కె.రామమణి, ఎన్. ప్రభాకరెడ్డిలను రిజర్వులో ఉంచారు.

### వివిధ కారణాల వల్ల నగర, పంచాయితీ ఎన్నికలు వాయిదా

ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్ సోమవారం మీడియా సమావేశం ద్వారా నోటిఫికేషన్ వివరాలను వెల్లడించారు. ఈనెల 11 నుంచి 13 వరకు నామిషన్లు స్వీకరించనున్నారు. 14న నామినేషన్ పత్రాల పరిశీలన, 16న ఉపసంహరణ, అదే రోజున మధ్యాహ్నం 3 గంటల తరువాత పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. మార్చి 23న పోలింగ్ నిర్వహించి, 27న ఫలితాలను విడుదల చేయనున్నారు. కాగా రాష్ట్రంలోని మొత్తం 15 మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా 12 కార్పొరేషన్లకు మాత్రం ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కోర్టు కేసుల కారణంగా శ్రీకాకుళం, నెల్లూరు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ల ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. మరోవైపు రాష్ట్రంలో 104 మున్సిపాలిటీ, నగర పంచాయితీలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేసింది. 75 మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ సిద్ధమవుతోంది. వివిధ కారణాలతో 29 మున్సిపాలిటీ, పలు నగర, పంచాయతీల్లో ఎన్నికను వాయిదా వేశారు.

### వాయిదా పడిన 29 మున్సిపాలిటీలు.. జిల్లాల వారీగా

శ్రీకాకుళం : ఆముదాలవలస, రాజాం
ప. గో : భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడు
కృష్ణా : గుడివాడ, జగ్గయ్యపేట, కొండపల్లి
గుంటూరు : బాపట్ల, మంగళగిరి, నరసరావుపేట, పొన్నూరు, తాడేపల్లి, గురజాల, దాచేపల్లి
ప్రకాశం : కందుకూరు, దర్శి
నెల్లూరు : గూడూరు, కావలి, బుచ్చిరెడ్డిపాలెం
చిత్తూరు : శ్రీకాళహస్తి, కుప్పం
వైఎస్ఆర్ జిల్లా : రాజంపేట, కమలాపురం
కర్నూలు : బేతంచర్ల
అనంతపురం : పామిడి, పెనుకొండ

# రాష్ట్రాభివృద్ధికి సీఎం నిర్ణయాలు భేష్

ఆయన తీసుకునే నిర్ణయాలను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. 2014లోనే వైఎస్సార్‌సీపీలో చేరాలని నిర్ణయించుకున్నానని, కానీ కొన్ని కారణాల రిత్యా టీడీపీలో చేరవల్సి వచ్చిందని వివరించారు. అయినా కూడా టీడీపీలో సరైన గౌరవం లభించలేదని, కాలం కలసిరాలేదని అన్నారు. ఇక డొక్కాను పార్టీలోకి సాధరంగా ఆహ్వానిస్తున్నట్లు మంత్రి సురేష్, ఎమ్మెల్యే అంబటి ప్రకటించారు. కాగా ఇటీవలే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసిన డొక్కా మాణిక్య వరప్రసాద్ సోమవారమే టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. టీడీపీ అధిష్టాన వైఖరి తీవ్ర ఆవేదనకు గురిచేసిందని లేఖలో పేర్కొన్నారు. రాజధాని రైతుల జేఏసీ పేరుతో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు. టీడీపీ నేతల చౌకబారు విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. 2019 ఎన్నికల్లో తాను తాడికొండ సీటును ఆశించానని.. కానీ ఓడిపోతానని తెలిసినా ప్రత్తిపాడు సీటు ఇచ్చారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత కూడా టీడీపీ అధిష్టానం తీరు తనను మానసికంగా కలచివేసిందని లేఖలో పేర్కొన్నారు.

# విశాఖ మేయర్ పీఠం వైఎస్సార్‌సీపీదే

ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటిస్తూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని రెహ్మాన్ గతంలో స్వాగతించిన విషయం తెలిసిందే. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమిని మూటగట్టుకున్న టీడీపీకి ఎన్నికల అనంతరం కీలక నేతలంతా గుడ్‌బై చెబుతున్నారు. తాజాగా టీడీపీ ఎమ్మెల్సీ, మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కూడా రాజీనామా చేసి చంద్రబాబుకు ఊహించని షాక్ ఇచ్చారు. ఇక సీఎం వైఎస్ జగన్ తీసుకున్న పాలనా వికేంద్రీకరణ నిర్ణయంతో టీడీపీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ నేతలు అధినేత చంద్రబాబు వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కీలకమైన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల పోరును నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని టీడీపీకి చెందిన పలువురు కీలక నేతలు వరుసగా పార్టీని వీడుతున్నారు. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు తయారైంది టీడీపీ పరిస్థితి.

# వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

పురందేశ్వరివారు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని.. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ప్రతిపక్షాలను దెబ్బతీసేందుకే ఇంత తక్కువ సమయంలో ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆమె ఆక్షేపించారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఇరు పార్టీల పొత్తుతో రాంష్ట్రంలోని అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామని చెప్పారు. ప్రజలు వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకుని ఓట్లు వేయాలని ఆయన కోరారు.

భవిష్యత్తులో తమ ఇరు పార్టీల మధ్య పొత్తు మరింత ధృడంగా, విజయవంతంగా ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని వెల్లడించారు. నాయకత్వాన్ని బలపరుచుకుంటూ ఓ అవగాహనతో ఇరు పార్టీల నేతలు ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు వెళ్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇరు పార్టీలు కలిసి ప్రజల తరపున పోరాటాలు చేయడంతో పాటు ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి మేలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

కేరళ నాయకుల ప్రాబల్యం కనిపిస్తుందని.. సీపీఎం పార్టీ ఒకే నాయకుడిని రెండు సార్లు రాజ్యసభకు నామినేట్ చేసే అవకాశం లేదని పార్టీకి చెందిన సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

సీతారాం ఏచూరి 2005 నుంచి 2017 వరకు రెండు సార్లు రాజ్యసభకు ఎన్నికయిన విషయం తెలిసిందే. మార్చి 26న పశ్చిమ బెంగాల్‌కు జరిగే రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేయాలని కొందరు నాయకులు భావిస్తున్నా.. మెజారిటీ నాయకులు పార్టీ సిద్దాంతాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. మోదీ, బీజేపీ తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తు.. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారని పార్టీ నేతలు సీతారాం ఏచూరిని ప్రశంసిస్తున్నారు.

### సీఎం జగన్‌కు ధన్యవాదాలుః పరిమల్ నత్వాని

నుంచి పరిమల్‌ను రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని అంబానీ స్వయంగా వచ్చి సీఎం వైఎస్ జగన్‌ను కోరారు. అలాగే ఏపీలో పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధికి సహకరిస్తామని భరోసా కూడా ఇచ్చారు. దీంతో పార్టీ ముఖ్యనేతలో చర్చించిన అనంతరం ఆయన పరిమల్‌ను పెద్దల సభకు నామినేట్ చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రకటించింది.

# గీతం ఫార్మశీ ఎన్ఎస్ఎస్ వైద్య శిబిరం



సాగర్‌నగర్ : స్థానిక సాగర్ నగర్ సమీపంలోని ముసలయ్యపాలెం అంగనవాడి పాఠశాల ఆవరణంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫార్మశీ ఇనిస్టిట్యూట్ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆద్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.గణపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్ధం చేసుకోవాలన్నారు.

ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాద్యతను మరవకూడదన్నారు. గీతం విద్యార్థులు పాఠశాలలను దత్తతకు స్వీకరించి నిరంతర కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో స్ఫూర్తి నింపుతున్నారని కొనియాడారు. దాదాపు 50 మంది గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య నిపుణుల పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిభిరం ద్వారా దాదాపు 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఏ వైద్యం పొందకుండా తీవ్ర అనారోగ్యంతో వచ్చిన 15 మంది రోగులను గీతం ఆస్పత్రికి తరలించారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఫార్మశీ విభాగం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుమంత మండల్, విద్యార్థి వ్యవహారాల డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలు పోషక విలువలుగల ఆహారం తీసుకోవాలి ....



కంచరపాలెం : గర్భిణీ బాలింతలు పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలని గ్రామ సచివాలయం ఎ .ఎన్ .ఎం లు సూచించారు . ఈమేరకు జీవీఎంసీ 40 వ వార్డు పరిధి జాకీర్ హుస్సేన్ నగర్ వద్ద అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఉదయం పోషణ పక్వడా కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో బాగంగా గ్రామ సచివాలయం ఎ .ఎన్ .ఎం కె .అనిత గర్భిణీలు, బాలింతలకు పొషకాహారం తీసుకోవటం వలన కలిగే ప్రయోజనాలకు వివరిస్తు పలు సూచనల చేసారు . ఎక్కువగా ఆకు కూరలు తీసుకోవాలని ఎప్పటికపుడు వైద్య పరిక్షలు నిర్వహించుకోవాలని అన్నారు . రక్త హీనతతో బాధపడుతున్న గర్భిణీ , బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు . కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ బేగం , సచివాలయం మహిళా పోలీస్ భవానీ , గ్రామ వాలంటీరిలు పెద్ద సంఖ్యలో గర్భిణీ , బాలింత మహిళలు పాల్గున్నారు .

# టిడిపి ఆరో వార్డు అధ్యక్షునిగా దాసరి శ్రీనివాస్



మధురవాడ : మహా విశాఖ వార్డుల విభజన అనంతరం నాలుగో వార్డు ఆరో వార్డు గా మారిన తరుణంలో తేదేపా నూతన వార్డు అధ్యక్షునిగా దాసరి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం దాసరి సినివాస్ ఇంట్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఉపాధ్యక్షుడు గోల్లంగి ఆనందబాబు ప్రతిపాదించగా నాయకులూ, కార్యకర్తలు సమర్దించడంతో తేదేపా ఆరో వార్డు అధ్యక్షునిగా దాసరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి సబ్బం హరి నియామక పత్రాన్ని సోమవారం దాసరి శ్రీనివాస్ కు అందజేశారు.

అలాగే కార్యదర్శిగా పోలిశెట్టి నాగేశ్వరావు నియమించారు ఈ కార్యక్రమంలో నేతలతో పాటు పోతిన ఎల్లంనాయుడు, పోతన అప్పల నాయుడు, బోయి శ్రీను, లోడ గల జానకిరామ్, పోతిన ప్రసాద్, రంగరాజు, రామకృష్ణ , బలరాం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మధురవాడ : మహా విశాఖ ఆరో వార్డు పరిధి పీఎం పాలెం వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తులసి నగర్ పార్క్ లో మహిళలకు వాకింగ్ కాంపిటీషన్, మెమరీ గేమ్స్ లాంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు జి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళ విద్యావంతురాలుగా ఎదగాలని అప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు, కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ నేడు మహిళలకు రక్షణ కరువైందని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను సామాజిక మార్పుతోనే అరికట్ట గలమని మహిళలు చైతన్యవంతులుగా రాణించాలని ఆశాభావంవ్యక్తం చేసారు.

అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ప్రసన్నకుమారి, భ్రమరాంబ, సత్యవతి, సత్య వేణి, రత్నమాల, చిన్నారి, రోజా తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ లేఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

- ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు గడువు ముగింపు
- మెట్రోపాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వర రావు

సిరిపురం: అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకము - 2020 (LRS Scheme -2020) రాష్ట్ర ప్రభుత్వము వారు జీఓఎంఎస్ నెం.10, తేది. 08-01-2020 నందు రాష్ట్రంలో గల అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరణ పథకము-2020 ప్రకటించియున్నారు. ఈ పథకము క్రింద 39;వి.యమ్.ఆర్.డి.ఎ పరధిలో (నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు మరియు గ్రామ పంచాయతీలలో) తేదీ. 31-08-2019 ముందు రిజిస్టరు కాబడియున్న అనధికార లే అవుట్లు (నాన్ లో అవుట్ల) మరియు అనధికార ప్లాట్ల యజమానులు నిర్ణీత అపరాధ రుసుము మరియు 14% ఓపెన్ స్పేస్ విలువ చెల్లించి పైన తెలుపబడిన ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం క్రమబద్ధీకరించు అవకాశం కలదు. ఇందు సంబందించి నిర్ణీత కాలము అనగా తేది. 06-04-2020 లోపు దాఖలు చేసిన దరఖాస్తులు 14% ఓపెన్ స్పేస్ ఖరీదులో 50% మినహాయింపు ఇవ్వడం జరుగుతుంది.

గమనిక: వి.యమ్.ఆర్.డి.ఎ. కార్యాలయము అనుమతింపబడిన సాంకేతిక నిపుణులు (LTP) ల ద్వారా LRS దరఖాస్తులు ఆన్‌లైను website: lrsdtcp.ap.gov.in లో దరఖాస్తు చేసుకోగలరు. క్రమబద్ధీకరించని అనధికార లే అవుట్ల స్థలముల యందు భవిష్యత్తులో ఇటువంటి లావాదేవీలు గాని ఏ విదమైన భవన నిర్మాణములు గాని అనుమతించబడవు.

## అప్పన్న కి పెళ్లి కుదిరేనంటా...

# భక్త జనులకు సంబరమంట

సింహాచలం: అప్పన్న కి పెళ్లి కుదిరే నంటా అంటూ భక్త జనులు వకరి పై వకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసకుంటున్నారు అందుకు కారణం సింహాద్రి నాథుని కి సోదరి పైడితల్లి అమ్మవారి కుమార్తె తో వివాహం నిశ్చయం అవటం వివరాల్లోకి వెళితే ప్రతీయేడు ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు నిర్వహించే బొట్టినడిగే పున్నమి గా ప్రతీతి ఉత్సవంలో భాగంగా సింహాద్రి నాథున్నిసింహగిరిపై నుంచి కొండ దిగువకు మెట్ల మార్గం గుండా వచ్చిన స్వామి తొలుత పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లి తనకు పిల్లనివ్వమని అమ్మవారిని అడుగుతాడు. ఏ ముంది నీకు.. ఏం చూసి పిల్లనివ్వాలని అమ్మవారు తిరస్కరిస్తుంది .. దీంతో స్వామి వారి అలిగి అక్కడి నుంచి వచ్చి పుష్కరిణి మండపంలో వెంచేసి డోలోత్సవం, వసంతోత్సవం , చూర్ణోత్సవం వైభవంగా జరిపించుకుంటారు.. ఈ వేడుక విషయాన్ని తెలుసుకున్న అమ్మవారు స్వామికి ఉన్న భక్తజనకోటి ఆయన ఆస్తి అని తెలుసుకుని పిల్లనివ్వడానికి ఒప్పుకొని స్వామీ వారిని



ఆహ్వానిస్తుంది.. అనంతరం స్వామికి పెళ్లి నిశ్చయమవుతుంది .. ఈ వేడుక ఖరారు కావడంతో సంతోషం తో సింహాచలం భక్త జనులు గ్రామస్తులు ఒకరిపైనొకరు రంగులు జల్లుకుని వసంతోత్సవం జరుపుకుంటారు.. అనంతరం గ్రామంలో తిరువీధి ఉత్సవం నిర్వహించ గా గ్రామ ప్రజలు స్వామి కి స్వామి కి స్వాగతం పలుకుతూ రంగు రంగుల హరివిల్లులు తో పుష్ప ఫలాలతో స్వామికి స్వాగతం పలికి స్వామి కి సమర్పించారు.

# సీనియర్ జర్నలిస్ట్ స్వర్గీయ కారునాయుడు కుటుంబానికి లక్ష రూపాయలు అందజేసిన పాత్రికేయులు



గాజువాక : స్వర్గీయ సినియర్ జర్నలిస్ట్ కారునాయుడు కుటుంబానికి గాజువాక పాత్రికేయుల సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో లక్ష రూపాయలు నగదును అందజేసారు. సోమవారం పరవాడలోని కారునాయుడు స్వగృహంలో కుటుంబ సభ్యులకు గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజా చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, అదీప్ రాజా లు మాట్లాడుతూ పాత్రికేయుడు గా మంచి పేరు తెచ్చుకున్న కారు నాయుడి అకాల మరణం కుటుంబానికి తీరని లోటని ఆ భగవంతుడు అన్నివిధాలుగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. రైట్ ఛాయిస్ పత్రికా సంపాదకులు గిరి మాట్లాడుతూ తమలో ఒక్కడు మంచి మనిషి , అందరితో కలిసి మెలిసి ఉండే మిత్రుడు కారునాయుడు అకాలమరణం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన విలేకరులు నుండి చిరు సహాయంగా సుమారు లక్ష రూపాయలు అందజేయడం జరిగిందని అన్నారు. వృత్తిలో ఎదురైన సమస్యల పరిష్కారానికి పాత్రికేయులు ఐక్యతగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పైల శ్రీను, గాజువాక, పారిశ్రామిక ప్రాంతం విలేకరులు గిరి ,కృష్ణ ,శశి, గౌతమ్, పరశురాము ,మూర్తి, ప్రకాశ్ పరవాడ లోకల్ రిపోర్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# 9 వ తేదీన శ్రీ కృష్ణచైతన్య మహాప్రభువు జయంతి ఉత్సవాలు

విశాఖ సిటీః ద్వాపరయుగంలోని శ్రీ కృష్ణ భగవానుడే శ్రీ కృష్ణచైతన్య మహా ప్రభువుగా అవతరించారని శాస్త్రంలో వర్ణించబడింది. 500 సంవత్సరాల క్రితం పశ్చిమ బెంగాల్‌లో శ్రీ కృష్ణచైతన్య మహాప్రభువు అవతరించారు. హరే కృష్ణ మహామంత్రంతో కూడిన హరినామ సంకీర్తనన్నాని ప్రచారంచేసి భారతదేశం అంతటా భక్తీ ఉద్యమంలో ప్రభంజనం సృష్టించారు. కుల మత వర్గ తారతమ్యాలతో కూడిన ఆనాటి సమాజంలో సృష్టిలోని ప్రతి ఒక్కరు ఆత్మ స్వరూపులమని, భగవంతుని అంశలము కాబట్టి భగవంతుణ్ణి సేవించుటకు అందరికీ సమాన హక్కు ఉందని వారు భోదించారు. శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడే. హరినామ సంకీర్తన ప్రచారం ద్వారా దేవాది దేవ భగవానుడి యెడల శరణాగతి భావాన్ని జనబాహుళ్యంలో పెంపొందించే లక్ష్యంతో వారు భక్తులు రూపంలో అవతరించినారు. దేవాదిదేవుని యెడల ప్రేమభావాన్ని పెంపొందించడానికి పవిత్రమైన హరినామ సంకిర్తనమును వ్యాప్తి చేసే లక్ష్యంతో వారు దేశవ్యాప్తంగా పర్యటించినారు.

# 94వ శ్రీ సనాతన జ్ఞాన సభలను ప్రారంభించిన మంత్రి అవంతీ

భీమునిపట్నం : 94వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు తగరపువలస పుట్ బాల్ గ్రౌండ్ లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాసరావు హాజరయి జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 94వ జ్ఞాన సభలు ఈ ప్రాంతంలో జరగడం మనందరి అదృష్టమని అన్నారు. ఈ సభలు .మూడు రోజులు పాటు జరగనున్నవి ఈ సభలలో అసంగా నందగిరి స్వామి శ్రీ వ్యాసాస్రమ వ్యాస పీఠాధిపతులు పూజ్య శ్రీశ్రీశ్రీ పరిపూర్ణా నందగిరి స్వాములు సనాతన వేదాంతంను బోధించారు. భగవద్గీత లో ఉన్న అధ్యాయాలను ఒకొక్క అధ్యాయం గురించి భోదించారు. ఏర్పేడు వ్యాస ఆశ్రమం నుంచి 150మంది స్వాములు, మాతలు పాల్గొన్నారు. స్థానిక మణికంఠ స్వీట్స్ అధినేత లు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ మరియు భక్తబృందం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

# డాక్టర్స్ మీట్‌లో వైద్యులకు ఘనసన్మానం



విశాఖపట్నం: కార్పొరేషన్ ఆర్.ఎ.మ్ (రిటైల్, అగ్రి, ఎమ్ఎస్ఎమ్ ఇ) కార్యక్రమంలో భాగంగా హోటల్ రాక్ డేల్ నందు డాక్టర్స్ మీట్ ను కార్పొరేషన్ బ్యాంక్ డి.జి.ఎమ్ జోనల్ హెడ్ బి.శ్రీనివాస్ శెట్టి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ బ్యాంక్ అన్ని వ్యాపార వర్గాలకు మరియు ముఖ్యంగా డాక్టర్లకు అన్నిరకాల బ్యాంకింగ్ సర్వీసెస్ ను చాలా త్వరితగతిన వివిధ రకాల సర్వీసుల ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఈ రకంగానే ఇకముందు కూడా డాక్టర్స్‌కు వారి ఆర్థిక అవసరాలకు కార్పొరేషన్ బ్యాంక్ అండగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమంలో ముగ్గురు మహిళా డాక్టర్స్‌కు వారి సేవలను గుర్తించి సన్మానించటం జరిగింది.

ఈ కార్యక్రమంలో డావ పి.వి. సుధాకర్ - ప్రిన్సిపల్ (ఆంధ్రా మెడికల్ కాలేజ్), డా కె. ఫణీందర్ సెక్రటరీ (ఐఎమ్), డా పి.ఎ. రమణి - ప్రెసిడెంట్ (ఐఎమ్), యంతూరు ప్రేమ్ బాబు-అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (విశాఖపట్నం మెయిన్ బ్రాంచ్-కార్పొరేషన్ బ్యాంక్), దినేష్ దేవరాని-చీఫ్ మేనేజర్ కార్పొరేషన్ బ్యాంక్ (జోనల్‌ఆఫీస్, విజయవాడ) విశాఖపట్నం కార్పొరేషన్ బ్యాంకు సిటీ బ్రాంచ్ మేనేజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ పి కోటేశ్వరరావు

విశాఖపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో గ్రేటర్లో అధికారులు, సిబ్బంది అందరూ ఎన్నికల విధులలో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం నాడు నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేయడమైనదని జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ పి కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషను స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినందున ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం ఉండదని ఆయన తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రకటించి, ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత యధావిధిగా స్పందన కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలియజేశారు.

# రిజర్వేషన్ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ విఫలం

## మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం : స్థానిక ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. సోమవారం నర్సీపట్నంలో అయ్యన్న స్వగృహంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో అయ్యన్న మాట్లాడుతూ గతంలో ఎన్నికలు నిర్వహణకు ముందు రిజర్వేషన్లు ప్రక్రియకు సంబంధించి అన్ని రాజకీయ పక్షాలతో ఎన్నికల కమిషన్ సమావేశం పెట్టి రిజర్వేషన్ల విధానం గురించి వివరించేవారని చెప్పారు. అయితే ఈ ఎన్నికలకు వార్డు విభజనల సైతం రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన తర్వాత కూడా వైసిపి ఎమ్మెల్యేలు చెప్పినట్లుగా అధికారులు నడుస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర జిల్లాలో టీడీపీ తరపున ఎన్నికల్లో పోటీ చెయ్యవద్దంటూ నాయకులకు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. జగన్‌కు ముందునుంచే బిసిలంటే పడదని, తెలుగుదేశం పార్టీ పుట్టిందే బిసిల నుంచి అని అన్న ఎన్టీఆర్ మొదటి సారి ముఖ్యమంత్రి అయినప్పుడు స్వయంగా అన్నారన్నారు. బిసి రిజర్వేషన్లపై కోర్టు తీర్పు ఇస్తే సుప్రిం కోర్టుకు ఎందుకు వెళ్లేలేదని ప్రశ్నించారు. కోర్టు మీద నెపంతో 16వేల మంది బిసిలకు ఎంపిటిసి స్థానాల్లో పోటీ చేయకుండా అర్హత కోల్పోయేలా చేశారన్నారు. ఒక్క విశాఖజిల్లాలోనే 652 ఎంపిటిసి స్థానాలు 221 రావాల్సి ఉండగా కేవలం 173 స్థానాలు మాత్రమే బిసిలకు దక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పభుత్వం ఎన్నికల నియమావళి ఉల్లఘిస్తున్న ఎన్నికల కమిషన్ అస్సలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసే సచివాలయాలకు వెంటనే వైసిపి రంగులు మార్చాలని డిమాండ్ చేశారు. పోలింగ్ బూత్‌లకు వైసిపి రంగులు ఉంటే ఓటర్లు ప్రభావితంకు గురికావడం జరుగుతుందని రంగులు మార్చే అవకాశం లేకపోతే వైసీపీ రంగులు లేని భవనాలు లేదా టెంట్లు ఏర్పాటు చేసి అక్కడ పోలింగ్ బూత్‌లు పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే హైకోర్టుకు వెళతామన్నారు. రెవెన్యూ అధికారులు ఉగాదికి పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ సంబంధించిన పనులతో సతమతమవుతున్నారు. ఉపాధ్యాయులు ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఉండడం వలన ఎన్నికల నిర్వహణలో పాల్గనకపోతే వాలంటిర్లతో ఎన్నికలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ చేయడం గాని డబ్బులు పంపిణీ చేయడం గాని జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని విజయ్‌సాయిరెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోళెం వెంకటరమణమూర్తి, టీడీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## మనుష్య రవాణా అమానవీయ చర్య

ఆధునిక సమాజంలో కూడా మనుషుల అక్రమ రవాణా జరుగుతుండటం కలిచివేస్తున్నది. ఈ అమానవీయ చర్య నేటి సామాజిక వికృత రూపానికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఎప్పటికప్పుడు మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా రోజురోజుకూ ఈ అభాగ్యుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలోనే మనుషుల అక్రమ రవాణాపై దక్షిణాసియా దేశాల రెండురోజుల అంతర్జాతీయ సమావేశం హైదరాబాద్‌లో గత శని, ఆదివారాల్లో జరిగింది. దేశంలోని ఇరువై ఆరు రాష్ట్రాల నుంచే గాకుండా మయన్మార్, థాయిలాండ్, బంగ్లాదేశ్, నేపాల్ లాంటి దేశాలనుంచి దాదాపు 150 మంది ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సమావేశం మనుషుల అక్రమ రవాణా నిరోధానికి నిర్దిష్టంగా చేపట్టాల్సిన చర్యలను ప్రభుత్వాలకు సూచించింది. నానాటికీ పెరుగుతున్న అక్రమరవాణా కేసుల పట్ల అప్రమత్తం చేయటం ఆహ్వానించదగినది. మానవ అక్రమ రవాణాపై సరిహద్దు భద్రతా దళం రూపొందించిన నివేదికలో బంగ్లా యువతుల వ్యాపార కేంద్రంగా ముంబయి, హైదరాబాద్ ఉన్నదని ధ్రువీకరించటం ఆందోళన కలిగించేదే. పడుపు వృత్తికి భారత్ అతిపెద్ద మార్కెట్‌గా మారిందన్నది ఇంకా అవమానకర విషయం. మనుషుల అక్రమ రవాణా అనగానే సాధారణంగా మహిళలను అక్రమంగా తరలించి వారిని బలవంతంగా వేశ్యావృత్తిలోకి దింపటంగానే భావిస్తున్నారు. కానీ ఇదొక్కటే కాకుండా ఇంకా మనుషుల అక్రమ రవాణా అనేకరూపాల్లో బానిసత్వానికి కొనసాగింపుగా సాగుతున్నది. పిల్లలు పెద్దలనే తేడా లేకుండా అనేక మంది అపహరించి ఏవిధమైన రక్షణలు లేని భయంకర పరిస్థితుల్లో పని చేయిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 12 లక్షల మంది అపహరణకు గురవుతున్నారు. ఇందులో నలభై శాతం చిన్నపిల్లలే ఉండటం దిగ్భ్రాంతికరం. నేరాల నమోదు జాతీయ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం 2014లో 5,466 కేసులు నమోదైతే, 2016లో 8,132కు చేరింది. గడిచిన పదేండ్లలో దేశంలో మానవ అక్రమరవాణా పదిహేను రెట్లు పెరిగిందని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు 180 మంది బాలికలు కనిపించకుండా పోతున్నారు. గల్లంతైన బాల, బాలికల జాడ మరెప్పుడూ, ఎక్క డా దొరుకటం లేదు. ఇలా గల్లంతైన వారు ఏమవుతున్నారు, ఏ పరిస్థితుల్లో ఉంటున్నారో ఊహించుకుంటేనే కడుపు తరుక్కుపోతుంది. దేశంలో 80 లక్షల మంది బాలికలు వేశ్యావృత్తిలో మగ్గుతున్నట్లు అనేక స్వచ్ఛంద సంస్థలు తమ అధ్యయనాల ద్వారా తెలియజేస్తున్నాయి. మన దేశంలో పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ మనుషుల శరీరాలతో అమానుష వ్యాపారం జోరుగా సాగుతున్నదని అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు నేపాల్, బంగ్లాదేశ్ నుంచి ఇండియాలోకి యువతుల, బాలికల తరలింపు ఐదింతలు అయిందని తాజా నివేదికలు తెలియజేస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. వివిధ రూపాల్లో కొన సాగుతున్న మనుషుల అక్రమ రవాణా మానవీయతను మంట కలిపి స్వార్థానికి పరాకాష్టగా నిలుస్తున్నది. చిన్న పిల్లలను భయంకరమైన పని పరిస్థితులుండే ఇటుక బట్టీలు, నూనె మిల్లులు, చెత్త ఏరే కంపెనీల్లో చీకటి గుహల్లో బంధించి పనిచేయిస్తున్న తీరు అనేక సందర్భాల్లో హైదరాబాద్ నగర శివార్లలోనే బయట పడింది. ఇక పేదరికాన్ని ఆసరాగా చేసుకొని సాగే దురాగతాలకు అంతేలేదు. హైదరాబాద్ పాతనగరంలో పేదరికాన్ని ఆసరాగా చేసుకుని పెళ్ళి ముసుగులో యువతులను తరలిస్తున్న అరబ్ షేక్‌ల దురాగతాలు తెలియనివికావు. బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని ఆదివాసుల పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దుర్మార్గులు చేసే దురాగతాలకు అంతేలేదు. యువకులను తరలించి బానిసల కన్నా హీనంగా పనులు చేయించటం మొదలు, బాలికలను అక్రమంగా తరలించి వారితో అమానుష వ్యాపారం చేయిస్తున్నారు. ఇతర దేశాల నుంచి ముఖ్యంగా నేపాల్, బంగ్లా, థాయిలాండ్‌ల నుంచి అమ్మాయిల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. గత ఏడాది హైదరాబాద్‌లో 33 మంది థాయి అమ్మాయిలను వ్యభిచార కూపాల నుంచి రక్షించిన ఘటన ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యం లో మనుషుల అక్రమ రవాణాపై దక్షిణాసియా దేశాల అంతర్జాతీయ సదస్సు చేసిన తీర్మానాలు, సూచనలు విలువైనవి. మనుషుల అక్రమ రవాణా విషయంలో న్యాయపరమైన, చట్టపరమైన భద్రతాపరమైన విషయాల్లో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని సూచిం చింది. మనుషుల అక్రమ రవాణాకు పాల్పడ్డవారికి ఏడాదికి మించి శిక్ష లేకపోవటంతో ఈ నేరాలకు అడ్డులేకుండాపోతున్నది.

# సబ్బవరం లో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది

### మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చిన - బి పద్మ



సబ్బవరం: మండల కేంద్రంలోని జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని శ్రీ గణేష్ దుర్గా నగర్ మహిళలు జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు, శ్రీ గణేష్ దుర్గానగర్ మహిళామణులు మండల కేంద్రంలో వైసిపి మహిళా నాయకురాలు బి పద్మ ఆధ్వర్యంలో మహిళలంతా ఏకమై కేక్ కట్ చేసుకుని ఆనందంతో ఒకరినొకరు తిన్పించుకొని మహిళలంతా మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకురాలు బి పద్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు మహిళలు రక్షణ పట్ల మన ముఖ్యమంత్రి దిశ చట్టం తెచ్చారని ఆమె ఆనందాన్నిదాన్ని సంతోషాన్ని వ్యక్తం చేశారు మహిళలు రాజకీయ ,ఉద్యోగ ఆకాశ రంగంలో గాని, రక్షణ రంగంలో గానీ మహిళలు ముందు ఉండాలని కోరారు. గతంలో మన ఇందిరమ్మ ప్రధానమంత్రిగా, ఉక్కు మహిళ గా అంతర్జాతీయ మహిళ గా ఖ్యాతి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో విజయ, రాధ ,నాగవరహాలమ్మ ,ఎర్రయ్యమ్మ , కుమారి నాగరత్నం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుల సమావేశం



భీమునిపట్నం : స్థానిక టీడీపీ కార్యాలయం లో టీడీపీ సమావేశం భీమిలి డివిజన్ అధ్యక్షుడు గంటానూకరాజు ఆధ్వర్యంలో జరిగింది ఈ సమావేశం లో ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ. విశాఖపట్నం నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి ఈరోజు నోటిఫికేషన్ రావడంతో అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేసారు మూడవవార్డుని బి.సి.మహిళకు కేటాయించడంతో ఎలాగైనా పార్టీ అధిష్ఠానం సూచనమేరకు పార్టీ అభ్యర్థిని గెలుపించుకోవాలని నూక రాజు అన్నారు వైసీపీ ప్రభుత్వం మీద ప్రజలలో అసం తృప్తి ఉందని, ఈ తొమ్మిదినెలలో వారు చేసిన అసమర్ధ పాలనను ప్రజలకు తెలియజేసి గత తెలుగుదేశం పార్టీ కాలంలో ఈ భీమిలి నియోజకవర్గశీలో మనం చేసే అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు చురకల రమణ, మారోజు సత్యవ్రపసాద్ ( గొల్లబాబు ) మాట్లాడుతూ. గంటా నూకరాజు గత 30 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉండి ఇక్కడ స్థానిక ప్రజలకు నిర్విరామంగా సేవాలందించారని, కౌన్సిలర్ గా, ఫ్లోర్ లీడర్ గా, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడుగా ఉండి కూడా ఎటువంటి ఆస్తులు సంపాదించలేదని, కుటుంబాన్ని, వ్యాపారాన్ని వదిలి ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ప్రజలకు ఎటువంటి కష్టము వచ్చినా నేనున్నానంటూ ముందుండి సమస్య పరిష్కారం అయ్యేవరకు విడిచిపెట్టరని అన్నారు కష్టపడి పనిచేసి టిడిపి ని గెలిపించి విశాఖ నగరపాలక సంస్థలో మొదటి గెలుపు మనదే కావాలని సూచించారు. భీమిలి డివిజన్ తెలుగు మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ.. గంటా నూకరాజు గారి సతీమణి గంటా అప్పలకొండ ను పోటీకి దింపాలని మొత్తం మహిళా లోకం అంతా ఆమెకు తోడుగా ఉండి అత్యధిక మెజారితో గెలిలించి గంటా నూకరాజు కి బహుమతిగా ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో గంటా నూకరాజు సతీమణి గంటా అప్పలకొండ అభ్యర్థత్వా న్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. నామినేషన్ రోజే మన గెలుపు నల్లేరుమీద నడక కావాలని ముక్తకంఠంతో నినాదాలు చేసారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, గండిబోయిన పోలిరాజు, కాసరపు ఎల్లాజి, పైడిపల్లి ఎల్లయ్యమ్మ, పుక్కళ్ళ లక్ష్మి కుమారి, కొక్కిరి అప్పన్న, అప్పికొండ నూకరాజు, బుత్తల అప్పారావు, వియ్యపు పోతురాజు, వాసుపల్లి గరగయ్య, దాసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్‌పై తేల్చేసిన గంగూలీ

ముంబై: ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగి తీరుతాయని బీసీసీఐ చీఫ్ గంగూలీ తేల్చి చెప్పాడు. ఈ విషయంలో మహారాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజేశ్ తోపే చేసిన వ్యాఖ్యలపై గంగూలీ స్పందించాడు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో పెద్ద ఎత్తున జనం స్టేడియాలకు వస్తే కరోనా వైరస్ మరింత వ్యాపించే అవకాశం ఉందని రాజేశ్ తోపే అన్నారు. కాబట్టి మ్యాచ్‌ల వాయిదా విషయంలో ప్రభుత్వంతో చర్చిస్తున్నామని, మహారాష్ట్రలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లను వాయిదా వేయాలన్న యోచనలో ఉన్నట్టు చెప్పారు. ఇలాంటి మ్యాచ్‌లను తరువాత నిర్వహించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 15 మంది కరోనా అనుమానితులు ప్రత్యేక పరిశీలనలో ఉన్నారని, 258 మంది డిశ్చార్జ్ అయినట్టు తెలిపారు. అయితే, ఎవరికీ కరోనా ఉన్నట్టు నిర్ధారణ కాలేదన్నారు. మంత్రి రాజేశ్ తోపే చేసిన వ్యాఖ్యలపై గంగూలీ స్పందించాడు. ఐపీఎల్ మ్యాచ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపే ప్రసక్తే గంగూలీ స్పష్టం చేశాడు. ఈ విషయంలో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, షెడ్యూలు ప్రకారమే మ్యాచ్‌లు జరుగుతాయని పేర్కొన్నాడు. అయితే, కరోనా కట్టడికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నాడు. కాగా, ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఈ నెల 29న జరగనుంది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై, గతేడాది ఫైనలిస్ట్ చెన్నై సూపర్ కింగ్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌తో కలిపి మొత్తంగా ఏడు మ్యాచ్‌లు రాష్ట్రంలో జరగనున్నాయి.

# సమయం

## మర్రిచెట్టు

ఊడలు నాటే మర్రిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్ పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజమై ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడి మీద వాడు చాడీలు చెప్పుకునే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కలియుగ రావణాసురుడు గానో!
నరకాసురుడు గానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంబీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభీష్టంపై - భూస్థాపితం తథ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటుదారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంబీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మర్రివిత్తువై ఇంతింతై
అంతై మర్రిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పధజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

రచయిత
యల్.సిద్ధూ

# పంచాంగం

మాసం : ఫాల్గుణ; తిథి : బ.పాడ్యమి రా.9.40; ఉత్తర రా.12.29; ఉ.వ.8.48ల 10.17.

మంగళవారం 10 -03 -2020

**మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

**వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

**మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

**కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

**సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

**కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

**తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తితీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

**వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

**ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సాను కూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

**కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

**మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.

# సంపదలను ప్రసాదించే శివుడు

సంకీర్తన



జీవితాన్ని ఆర్థిక పరిస్థితి ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అన్ని ఆనందాలు .. సంతోషాలు ఆర్థిక పరిస్థితితో ముడిపడిలేకపోయినా, అది చూపించే ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరాలు .. ఆపదల బారినుంచి బయటపడటానికి ఆర్థిక పరిస్థితి బాగా ఉండవలసిందే. అలాంటి పరిస్థితుల్లో ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఒక్కరూ సంపదలను కూడా భగవంతుడిని కోరుతుంటారు.

ఇలా సంపదలను పొందాలనుకున్నవాళ్లు, పరమశివుడిని పూజించడం వలన ఫలితం ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. సోమవారం పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజున స్వామివారిని మారేడు దళాలతోను .. శంఖు పుష్పాలతోను పూజించడం వలన, సంపదలు చేకూరుతాయని ఆధ్యాత్మిక గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. అందువలన ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి బయటపడాలనుకునేవాళ్లు, సదాశివుడిని ఈ రీతిగా పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

## ఆపదలు తొలగించే అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ రూపంలో వున్నా .. ఏ పేరుతో కొలవబడుతూ వున్నా అమ్మ ప్రేమతో అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందువల్లనే అమ్మవారి ఆలయాలు ఎక్కడ వున్నా భక్తులతో నిత్యం సందడిగా కనిపిస్తూనే ఉంటాయి. అమ్మవారిని పూజించడం వలన సౌభాగ్యం నిలుస్తుందని .. సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇక అమ్మవారు ఆవిర్భవించిన 'అష్టమి' తిథి రోజున ఆ తల్లిని పూజించడం మరింత మంచిదని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వలన .. పారాయణం చేయడం వలన .. ఆ రోజున 8 రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించడం వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా అనారోగ్యాలు .. ఆపదలు దరిచేరవు. జీవితాన్ని అనారోగ్యాలు .. ఆపదలు అతలాకుతలం చేస్తుంటాయి. అందువలన అలాంటి గండాల బారిన పడకుండా అష్టమి రోజున అమ్మవారిని ఆరాధిస్తూ ఉండాలి.



## శేమునాపల్లిలో నేడు అభయాంజనేయస్వామి
# ఆలయ వార్షికోత్సవ వేడుకలు



చోడవరం : మండలంలోని శేమేనాపల్లి గ్రామంలో నేడు (మంగళవారం) అభయాంజ నేయ స్వామి ఆలయ 17వ వార్షి కోత్సవం వేడుకలు నిర్వహి స్తున్నట్లు గ్రామ తాజా మాజీ సర్పంచ్ శరగడం ఉమా దేవి, శ్రీనివాస రావు తెలిపారు. గ్రామ ప్రజల సహాయ సహ కారాలతో జరిగే ఈ కార్య క్రమంలో భాగంగా ఉదయం నుండి ఆంజనేయ స్వామికి సింధూరం, తమల పాకులతో విశేష పూజలు ఉంటాయని, అలాగే మధ్యా హ్నం భారీ అన్నదానం, సాయంత్రం భజన కార్యక్రమం ఉంటుందన్నారు.

# పంచాయతీ సర్పంచ్ల రిజర్వేషన్లు ఖరారు

గొలుగొండ : మండలంలోని 27 గ్రామపంచాయతీలో సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ అధికారులు పంపిన సమాచారాన్ని గొలుగొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపికుమార్ సోమవారం విడుదల చేశారు. పంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి. పాతకేడిపేట, చీడికాడ, నాగాపురం, లింగంపేట, గాదంపాలెం, అమ్మపేట, పుత్తడి గైరంపేట, కొమిర జనరల్ కేటగిరికి కేటాయించగా, కొంగసింగి, లింగందొరపాలెం, సాలికమల్లవరం, రావణాపల్లి, యర్రవరం, చిన్నయ్యపాలెం, కంతారంకు జనరల్ ఉమెన్‌కు కేటాయించారు. చోద్యం, కొత్త మల్లంపేట, కొత్త ఎల్లవరం బిసి జనరల్, పప్పు శెట్టిపాలెం, పాకలపాడు, గుండుపాల, బిసి మహిళ, గొలుగొండ, చీడిగుమ్మల ఎస్సీ, ఏజెన్సీ లక్ష్మీపురం, జోగుంపేట ఎస్సి మహిళ, ఏటిగైరంపేట ఎస్టీ, పాతమల్లంపేట, కశిమి ఎస్టీ మహిళకు కేటాయించారు.

## శివయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో
### మహిళలకు,వృద్ధులకు స్టీల్ కంచాలు, గ్లాసులు పంపిణీ

41వ వార్డు సిద్ధార్థ నగర్ లో మహిళా దినోత్సవం సందర్భంగా శివయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలకు వృద్ధులకు స్టీల్ కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దాసరి శివ శంకర్ రావు మాట్లాడుతూ పేద మహిళలు, వ ృద్ధులు పెద్ద ఎత్తున ఒక చోట చేరి ఈ కార్య క్రమం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు అంతే కాకుండా పేదవారికి ఎప్పుడు తమ ట్రస్టు తరపున సాయం ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ దాసరి సముద్రం, కరెడ్ల అప్పలరాజు, గణేష్, శ్యామల ,రాజేశ్వరి, గంగరాజు, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ అమలు

కోటవురట్ల : స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు కోడ్ అమలులోకి రావడంతో అధికారులు చర్యలు ప్రారంభించారు. గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నేతలు, నాయకుల ఫ్లెక్సీలను తొలగించే పనిలో పడ్డారు.


**IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM**
**A.S. 68/2018**

**Between :**
Ravi Venkata Ramana @ Ayyarao ...Appellant
**And**
Ravi Satya Rao (died) & 6 others ...Respondents

**APPEAL NOTICE**

**To,**
**Respondents :**
**R-2 : Ravi Ramanababu, S/o. late Appala Naidu, Hindu, 42 years, R/o. Sytharupeta (V), S. Rayavaram (M), Visakhapatnam Dist.**
**R-3 : Ravi Bhaskarao, S/o. late Venkataramana, Hindu, 45 years, Employee : Vizag Steel Plant, R/o.Desapatrunipalem, Parawada, Visakhapatnam.**
**R-4 : Smt. Ravi Lakshmi, W/o. late Satya Rao, Hindu, 57 years, R/o. Sytharupeta (V), S.Rayavaram (M), Visakhapatnam Dist.**
**R-5 : Ravi Balaji, S/o. late Satya Rao, Hindu, 35 years, working in Indian Army, Rest -do-.**
**R-6 : Ravi Raja Sekhar, S/o. late Satya Rao, Hindu, 35 years, working in Indian Army, Rest -do-.**
**R-7 : Smt. Gompanapalli Sri Lakshmi, W/o. Yugandhar, Hindu, 31 years, Rest -do-.**

Notice is hereby given that the above named appellant filed the above appeal against the decree and judgement of the learned Hon'ble Court of Senior Civil Judge, Yelamanchili, Dated 10-11-2017 made in O.S. 119 of 2010 and the matter stands posted to **30-03-2020** for your appearance. The above mentioned respondents are therefore hereby directed to appear before the Hon'ble VII Addl. District Judge Court, at Visakhapatnam either in person or through duly instructed Advocate on **30-03-2020 at 10:30 A.M** to answer all material questions failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

**(By Order of the Hon'ble Court)**

**A. VENKATESWARA RAO**
Advocate
Visakhapatnam.
**Cell : 9246624779**


## సాయిపూజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ఉచిత నిర్ధారణ పరీక్షలు




విశాఖపట్నం : గొల్లలపాలెం ఆర్‌టి క్లబ్ వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్యాన్సర్ పై అవ గాహన సదస్సు...,

నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది. ఆర్‌టి క్లబ్ సాయి పూజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో సాయి పూజా ఫౌండేషన్ చైర్మన్ వానపల్లి రవికుమార్, డా.రమణి, డా.సుజాతా, డా.ఉషా, డా.సుబ్ర మణ్యం, డా.వినీల, డా. కనక మహాలక్ష్మి, సినీ నటుడు యద్ కుమార్, ఆర్‌టి క్లబ్ సభ్యులు, కాంతారావు, సురేష్, వాసు, శంకర్, రాంబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ టవర్ తొలగించాలని ఆందోళన



భీమునిపట్నం : తగరపు వలస జోగావారివీధి లో నివాసితులు నివాసాల మధ్య సెల్ టవర్ ఉందని దానిని తొలగించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసెల్ టవర్ ను 2006లో 15ఏళ్ల లీజుకు ఒప్పందం కుదుర్చుకుని పెట్టారనీ అన్నారు. అయితే మొదట టాటా ఇండికం పేరుతో పెట్టారనీ, ఇటీవల జియో వచ్చిన నుంచి దీని ద్వారా కనెక్షన్ లు ఇచ్చారనీ,అంతేకాకుండా ఎయిర్ టెల్ 4జి కూడా ఈ టవర్ నుంచే కనెక్షన్ ఇచ్చారని తెలిపారు. దాంతో ఈ సెల్ టవర్ నుంచి రేడియేషన్ వల్ల ఇక్కడ నివసించే వారు అనారోగ్యానికి గురవుతున్నారని, అంతేకాకుండా ఇద్దరు అనా రోగ్యంతో చనిపోయారని తెలిపారు. చిన్న పిల్లల ఆరోగ్యం కూడా క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఒక సంవత్సరం లీజు ఉన్నప్పటికీ ఈ సెల్ టవర్ ను వెంటనే తీసివేయాలనీ వారు కోరారు.

## 'మా' సంస్కృతి ఆధ్వర్యంలో
# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



విశాఖపట్నం : మా సంస్కృతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంవీపీ కాలనీలో ఎస్.వి.వి.పి వి.ఎం.సి మహిళా కాలేజ్ లో జరిగిన వేడుకలకు రైటర్స్ అకాడమీ చైర్మన్, సీనియర్ పాత్రికేయులు వి.వి రమణమూర్తిముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లా డుతూ మహిళలు ఎన్నో విజ యాలు సాధిస్తున్నారని చెప్పారు. ప్రజాపిత బ్రహ్మకుమారిస్ ప్రతినిధి బికె రామేశ్వరిని ఆదర్శ మహిళగా గుర్తించి ఘనంగా సత్కరించి మెమోంటో ను ప్రదానం చేశారు. అనంతరం బ్రహ్మకుమారిస్ ప్రతినిధి బికె రామే శ్వరి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారని చెప్పారు. లక్ష్మీ భార్గవి దువ్వాడ మాట్లాడుతూ ప్రతి ఏటా మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మా సంస్కృతి కళా పరిషత్ చైర్మన్ పాజిటివ్ హోమియోపతి డాక్టర్ జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ లారెన్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వైభవ కోలాటం భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాటం ప్రదర్శన, స్కూల్ ఆఫ్ దీయటర్స్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి

# ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి

### నాతవరం మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వి.మోహన్‌రావు



నాతవరం : ఎన్నికలు ప్రశాంతంఆ జరిగేందుకు రాజకీయ నాయకులు సహకరించాలని నాతవరం మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వి.మోహన్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాతవరం మండలం 27 పంచాయతీలకు సంబంధించి 18 సెగ్మెంట్లలో ఎన్నికలు జరగనున్నాయన్నారు. మూడు జోన్‌లుగా విభజించడం జరింగిందన్నారు. ఆరు టీమ్‌లు ఎన్నికలకు పని చేస్తాయన్నారు. మొత్తం 51095 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎంపిటిసి, జెడ్పీటీసీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు పాల్గొన్నారు.

## సీపీఎం పార్టీ తరుపున
### ఎంపీటీసీగా నామినేషన్ వేసిన కొండలరావు

అనంతగిరి : మండల కేంద్రం, మండల పరిషత్ అభివృద్ధి కార్యా లయంలో సోమవారం నుంచి నామినేషన్లు ఎంపిటిసిలకు నామి నేషన్ల పర్వం మొదలైంది. సోమవారం వెంగడ ఎంపిటిసి సెగ్మెంట్ నకు సిపిఐఎం తరపున సివేరి కొండలరావు నామినేషన్ వేయడం జరిగింది. గుమ్మకోట సెగ్మెంట్ నుంచి నామినేషన్ వేయడానికి అభ్యర్థులు వచ్చినా నామినేషన్ వేయడానికి కాలము అయిపోవ డం వలన నామినేషన్ తీసుకోలేదని ఎన్నికల అధికారి తెలిపారు.

# మొదటిరోజు నామినేషన్లు నిల్

గొలుగొండ : స్థానిక సంస్థలకు సంబంధించి ఎంపిటిసిలకు నామినేషన్ల సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. సోమవారం మధ్యాహ్నం వరకు ఎంపిటిసి అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. సోమ వారం మధ్యాహ్న రెండు గంటలకు వైసిపి టిడిపిలో కొన్ని సెగ్మెం ట్లకు ఎంపిటిసి అభ్యర్థులు ఖరారయ్యారు. అయితే సమయా భావం తక్కువగా ఉండడంతో ఖరారైన అభ్యర్థులు సోమవారం నామినేషన్లు వేయలేదు.

## మండలంలో
# 56 పోలింగ్ కేంద్రాలు


ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాధ

కోటవురట్ల : ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి కోటవురట్ల మండలంలో 56 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల రిట ర్నింగ్ అధికారి అనురాధ తెలిపారు. సోమవారం కోట వురట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలే కర్లతో మాట్లాడారు. మండ లంలో 16 ఎంపిటిసి స్థానా లకు ఒక జెడ్పీటీసీ స్థానానికి ఈ నెల 21న ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాన్ని ఐదు జోన్‌లుగా విభజించి ఆరు రూట్లను ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ముందు జాగ్రత్తలు చేపట్టామన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అందరూ సహకరించాలన్నారు.

### ఆమ్నీ ఆసుపత్రిలో ఊగిల్స్ విభాగ సేవలు



విశాఖపట్నం : మహిళలు, పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా ఓమ్ని హాస్పటల్స్ రామనగర్ లో గిగిల్స్ ఉమెన్, చిల్డ్రన్స్ హాస్పటిల్ ను ఘనంగా ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించకుని ఉమెన్ హుడ్ కు గౌరవ చిహ్నంగా ఇన్కేర్ హాస్పటల్స్ గ్రూప్ ఈ కార్యక్రమం చేపట్టిందని ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.రాధాకృష్ణ అన్నారు. అత్యంత అర్హత కలిగిన కారుణ్య ప్రసూతి, గైనకాలజీ నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎఐసీయూ), పీడియాట్రిక్ జట్ల నాయకత్వంలో అత్యాధునిక సౌకర్యం, మౌళిక సదుపాయాలున్నాయన్నారు. తల్లి, పిల్లల విభాగంలో అన్ని ప్రాథమిక, సూపర్ స్పెషాలిటీ సేవలు ఒకేచోట అందిస్తున్నామన్నారు. ఐవీఎఫ్, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, మినిమల్ ఇన్వాసివ్ సర్జరీ, లాపరోస్కోపిక్, పెయిన్లెస్ లేబర్, ప్రివెంటివ్ ఆంకాలజీ. ప్రసూతి సేవలందిస్తామని రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ కె.శేషగిరి, డాక్టర్ బి.రాజశేఖర్, డాక్టర్ నగేష్, రాధాకృష్ణ, సాయి, డాక్టర్ ఎంఎస్ఆర్. పల్లవి, వెంకరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏయూకు విచ్చేసిన అమెరికా ఆచార్యులు
### వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి


మూర్తిని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని టెక్సాస్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆచా ర్యులు, నానో టెక్నాలజీ రీసెర్చ్ ప్రోగ్రామ్ సంచా లకులు డాక్టర్ భాగ వతుల మూర్తి సంద ర్శించారు. వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున డాక్టర్ మూర్తిని వీసీ ప్రసాద రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT VISAKHAPATNAM**
**Dispute. No. 266 / 2019**

**BETWEEN:**
**M/s.Kapil Chits (Kosta) Pvt. Ltd, Gajuwaka Branch, Visakhapatnam ... Disputant**
**AND**
**Sri. K.Sridevi & Others ...Opponents**

**OP-1 : Karanam Sridevi, W/o. Naga Raju, Hindu, Aged 37 years, R/o. D.No.26-13-135, Chinnagantyada, Opp: Sai Master School, Old Gajuwaka, Visakhapatnam. .**
**OP-4 : Neelam Soma Raju, S/o. Suryanarayana, Hindu, Aged 54 years, R/o. D.No.27-3-57/3, Srinagar, Opp: Raghavendra Public School, Gajuwaka, Visakhapatnam.**
**OP-6 : Karanam Naga Raju, S/o. Appala Naidu, Hindu, Aged 43 years, R/o. D.No.26-13-135, Chinnagantyada, Opp: Sai Master School, Old Gajuwaka, Visakhapatnam.**
**OP-7 : Sariyam Bhima Raju, S/o. Ramudu, Hindu, Aged 46 years, R/o. Qtr.No.127/E, Middle, Sector-5, Ukkunagaram, Steelplant, Visakhapatnam.**

**NOTICE**

Please take notice that the above named Disputant has instituted the above Dispute against for you recovery of Dispute amount with subsequent interest and costs, and the Honourable Court order notice to you through this publication. Hence you are here by Noticed to appear in the above court at District Registrar of Chits /Arbitrator, 6th Floor, Udyog Bhavan, Vuda Complex, Siripuram, Visakhapatnam-530003, in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Dispute on **30-03-2020 at 11.00 A.M** in default of your appereance on that day the Dispute will be heard and determined in your absence.

**Adjournment Date : 30-03-2020**

**Sri. A.VENKATESWARA RAO**
**& Sri. P.SATYANARAYANA,**
**Advocates**
**Visakhapatnam.**



**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT VISAKHAPATNAM**
**Dispute. No. 267/2019**

**BETWEEN:**
**M/s.Kapil Chits (Kosta) Pvt. Ltd, Gopalapatnam Branch, Visakhapatnam ... Disputant**
**AND**
**Sri. B.Sankara Rao & Others ...Opponents**

**OP-1 : Birlangi Sankara Rao, S/o.Tulasi Rao (Late), Hindu, Aged 41 years, R/o. D.No.3-70/4, LIG-58A, Mithilapuri Vuda Colony, Madhurawada, Visakhapatnam.**
**OP-2 : Yedurupaka Venkata Siva Kumar, S/o. Dharmayya (Late) Hindu, Aged 50 years, R/o.D.No.7-1-10/1, Municipal Colony, Opp: Syndicate Bank, Chinawaltair, Visakhapatnam-17**

**NOTICE**

Please take notice that the above named Disputant has instituted the above Dispute against for you recovery of Dispute amount with subsequent interest and costs, and the Honourable Court order notice to you through this publication. Hence you are here by Noticed to appear in the above court at District Registrar of Chits /Arbitrator, 6th Floor,Udyog Bhavan, Vuda Complex, Siripuram, Visakhapatnam-530003, in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Dispute on **30-03-2020 at 11.00 A.M** in default of your appereance on that day the Dispute will be heard and determined in your absence.

**Adjournment Date : 30-03-2020**

**Sri. A.VENKATESWARA RAO**
**& Sri. P.SATYANARAYANA,**
**Advocates**
**Visakhapatnam.**


# సత్యదేవునికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు బ్యాటరీ కారు బహుకరణ



అన్నవరం : తూ.గో. జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం వీర వేంకట సత్య నారా యణ స్వామి వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్నవరం వారు బ్యాటరీ కార్ డొనేట్ చేశారు.

అయితే ఆ కారును దేవస్థానం సహాయ కమి షనర్ డి.ఎల్.వి.రమేష్ బాబు, బ్యాంక్ జనరల్ మేనేజర్ బి.వి.యస్.కె.టి. భాస్కర్. డి.జి.యమ్.గిరిధర్.రీజనల్ మేనేజర్ డి.లలిత, తుని బ్రాండ్ మేనేజర్ మరియు అన్నవరం స్టేట్ బ్యాంకు సిబ్బంది మరియు దేవస్థానం సిబ్బంది తదితరులు ప్రారంభించారు.

## ఈనెల 11న భీమిలి గ్రామదేవత శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ వారి చాటింపు



భీమునిపట్నం : శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలనీ ఉత్సవ కమిటీ అధ్యక్షులు వాసుపల్లి ఎల్లాజీ (రంగ) తెలిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఉత్సవకమిటీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకాలమ్మ ఉత్సవాలను విజన్ 2020 లో ఘనంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని అన్నారు. రేపు బుధ వారం రాత్రి 12గంటలకు అమ్మవారి చాటింపు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రధాన కార్యదర్శి అప్పికొండ. అప్పల నాయుడు మాట్లాడుతూ ఈనెల 22న తొలేళ్ళ ఉత్సవం, 23న అనుపు మహోత్సవం,24న పాపమ్మ పండుగ, 25న ఉగాది పండుగ కార్యక్రమం తో ఈ ఉత్సవాలు ముగింపు అవుతాదని అన్నారు.

కోశాధికారి ఎచ్చెర్ల హరి మాట్లాడుతూ మూడు జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన తల్లిగా నూకాలమ్మ పేరు గాంచిందని అన్నారు. ఈ సమావేశం లో ఉత్సవకమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కాసరపు చిన ఎల్లాజీ, కోఆర్డి నేటర్ కోంద్రు రామ.సూరప్పడు,ఆలయ నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి గంటా నూకరాజు, కదిరి జగన్నాధం, మైలపల్లి లక్ష్మణరావు, పి.ఎర్రయ్య రెడ్డి, కె.రమణబాబు, సి.హెచ్. గౌరి నాయుడు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

చోడవరం : రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం స్థానిక మండలపరిషత్తు కార్యాలయం ఆవరణలో ఎం.పీ.టీ.సీల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రత్యేక అధికారి పి.వెంకటేశ్వరరావు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఈ నెల 11 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని, నిర్ణీత సమయంలోగా అభ్యర్థులు నామినేషన్ ఫీజు చెల్లించి, పూర్తి చేసిన ధరఖాస్తులు సమర్పించాలన్నారు. అలాగే 32 పంచాయతీలకు సంబంధించి 25 ఎంపీటీసీల స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాలుగా శ్రీరామపట్నం, నరసయ్యపేట, లక్కవరం, జన్నవరం, గాంధీ గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పీడీవో దుర్గా శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

## వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలి

### నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ : నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పిలుపునిచ్చారు. సోమవారం జోగుంపేటలో ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక నేతలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీ ఆశయానికి తగ్గట్టుగా పని చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. గ్రామ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం కొరవడితే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. నాయకులు ఐక్యమత్యంతో పని చేసి పార్టీ గెలుపే ధ్యేయంగా ఎన్నికలను ఎదుర్కొవాలని చెప్పారు. ప్రజల మధ్య ఉండే నాయ కులకు పోటీ చేసే అవకాశం కల్పించాలని, ప్రజాభిష్టం మేరకు పార్టీ అభ్యర్థుల ఎంపిక జరగాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు రాయపురెడ్డి నాగేశ్వరావు, సీనియర్ చిటికెల భాస్కరనాయుడు, సుర్ల గిరిబాబు, పాతమల్లంపేట మాజీ సర్పంచ్ లెక్కల సత్యనారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జివిఎంసి ఎన్నికలు

## ప్రశాంతంగా జరగడానికి కృషిచేయాలి

### జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ వి.కోటేశ్వరరావు



విశాఖ సిటీ: జివిఎంసి పరిధిలో చాలా సంవత్సరముల తర్వాత ఎన్నికలు జరుగుచున్నందున, ఎటువంటి అవాంతరములు తలెత్తకుండా చూస్తూ నియమాళిని అనుసరించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి జివిఎంసిలో గల ప్రతి అధికారి, ఉద్యోగి, జోనల్ కమిషనర్లు మరియు సిబ్బంది, రిటర్నింగు అధికారులు, అసిస్టెంటు రిటర్నింగు అధికారులు తగు కృషి చేయాలని కోరారు. ప్రధాన కార్యలయపు సమావేశపు మందిరం నుండి జోనల్ కమిషనర్లు ఎన్నికల సిబ్బంది రిటర్నింగు మరియు అసిస్టెంటు, రిటర్నింగు అధికార్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రిని భద్రపర్చుకోవడానికి జోనల్ కమిషనర్లు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగు అయిన తర్వాత రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని, వాటికి సంబంధించిన రూటు మ్యాపులను తయారు చేసి, ప్రధాన కార్యాలయంలో గల ఎన్నికల విభాగంలో అందించా లని ఆదేశిం చారు. నోడల్ అధికారులు, రూటు ఆపీసర్లు నియమకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఎన్నికల నియమావళి అమలులో నిర్లిప్తత వహించరాదని సూచించారు. పారద ర్శకంగా ఎన్నికలు జరిగేటట్లు తగు జాగురూకత వహించాలని, జోనల్ కమిషనర్లును ఆదేశించారు. ఓటర్ల జాబితాలను కూడా ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉంచుకోవాలని కోరారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కమిషనర్లు తమీమ్ అన్సారియా, జి.వి.రమణి, సోమన్నారాయణ, జివిఎంసి కన్సల్టెంటు జివివిఎస్ మూర్తి, డిసిఆర్ ఫణిరామ్ పాల్గొని కొన్ని సూచనలు చేశారు. ఇంకా పి.డి.యుసిడి శ్రీనివాసరావు, చీఫ్ ఇంజనీరు వేంకటేశ్వరరావు, జాయింట్ డైరక్టర్ (అమృత్) సత్యనారాయణ, ఎన్నికల విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వం

### మాజీ ఎమ్మెల్యే అనిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిత

కోటవురట్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి వైసిపి ప్రభుత్వం బిసిలకు అన్యాయం చేసిందని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆరోపించారు. సోమవారం కోటవురట్ల మండలం జల్లూరులో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. ప్రస్తుతం పరిస్థితి టీడీపీకి అనుకూలంగా ఉందన్నారు. అలాగే తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు కాశీనాయుడు, పార్టీ శ్రేణులు జనార్ధన్, బాబ్జి పాల్గొన్నారు.

## వైసీపీకి సవాలుగా మారిన

## పెద్దాపురం మున్సిపల్ ఛైర్మన్ పదవి

పెద్దాపురం : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపధ్యంలో పెద్దాపురం మున్సిపల్ ఛైర్మన్ పదవి వైసీపీకి ఒక సవాలుగా మారినదని అంటున్నారు. 2014 సాధారణ ఎన్నికలలో ఎమ్మెల్యే తెలుగుదేశం అభ్యర్థి చినరాజప్ప గెలవడం, మున్సిపాలిటీని కూడా తెలుగుదేశం అభ్యర్థి రాజా సూరిబాబురాజు గెలుపొందడం జరిగినది. మరలా 2019 ఎన్నికలలో రాష్ట్రమంతా వైసీపీ విజయం సాధించి 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్నప్పటికి, పెద్దాపురంలో మాత్రం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చినరాజప్ప మరలా రెండవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించడం, అందరికి ఆశ్చర్యం కలిగించిన విషయంగా చెబుతున్నారు.

జగన్మోహనరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడం వలన పెద్దాపురం మున్సిపల్ ఛైర్మన్ పదవిని స్థానిక వైసీపీ నేతలు తప్పనిసరిగా గెలిపించుకోవలసిన బాధ్యత ఏర్పడినదని అంటున్నారు.

ఒక వైపు వైసీపీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, మరోవైపు పెద్దాపురం నియోజకవర్గ తెలుగుదేశం శాసనసభ్యులు చినరాజప్ప కావడంతో సర్వత్రా ఛైర్మన్ పదవి ఏ పార్టీకి దక్కుతుందో అన్న ఆతృత వ్యక్తం అవుతున్నది. ఈ నేపధ్యంలో ఎలక్షన్ కమిషన్, పెద్దాపురం మున్సిపాలిటీని బీసీ మహిళగా ప్రకటించడం మరింత ఉత్కంఠ కలిగిస్తున్నదని, ఇరుపార్టీల నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. సమయం తక్కు వగా వుండడం, పార్టీల తరపున పోటీకి అర్హత గల అభ్యర్థులను ప్రకటించడం వంటి కీలకమైన పరిష్కారాలు కొరకు పార్టీల నేతలు కృషి చేస్తుండడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

## మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

యానాం : యానాం శివారు సావిత్రినగర్‌కు చెందిన విద్యాం నీలాద్రి ఇటీవల జరిగిన రోడు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. సోమ వారం ఉదయం పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు సావిత్రినగర్ వెళ్ళి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా, మరొక విద్యార్థి తీవ్ర గాయ లతో కాకినాడ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంతో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాదం జరిగిన సలలను స్థానిక పరిపాలనాధికారి శివరాజ్ మీనా, ఎస్పీ భక్తవత్సలతో కలిసి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. జరిగిన సుదుటనపై అక్కడ ఉన్న వారిని అడిగి మంత్రి వివరాలు ఏ తెలుసుకున్నారు. అదేవిదంగా ఇటీవల మృతిచెందిన పలువురు కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు



యస్.రాయవరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ధర్మవరం వీధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మరియు యలమంచిలి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. యలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకరరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించిన నాడే వారు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినట్లు తెలిపరు. అడిషినల్ సివిల్ జడ్జి జి.ధర్మారావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో దూసుకు పోతున్నారని తెలిపారు. ప్రభుత్వ సహాయ న్యాయవాది డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు కుటుంబ నేపధ్య వ్యవహారంలో పూర్తి పరిజ్ఞానం పొందిన నాడే సమాజం పూర్తిగా అభివృద్ధి చెందుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డిఎస్ఎన్.రాజు, జెసి రామకృష్ణ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## అందరూ నైపుణ్యాలను పెంచుకోవాలి : మంత్రి మల్లాడి

యానాం : నెహ్రూ యువకేంద్రం అధ్వర్యంలో జరుగుతున్న ట్రైనింగ్ యూత్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమంలో యువతి, యువకు లందరు తమ నెపుణులను పెంచుకోవాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. సోమవారం సాయంత్రం మెట్లకుర్రులోని రమాభాయ్ నగర్‌లోని లయన్స్ కమ్యూనిటీ హాలులో యువ తియువకులకు గత నాలుగు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశనికి ముఖ్య అతిధిగా హాజరై మాటాడారు. దీనిలో భాగంగా యువత తమ నైపుణ్యలను అభివ ృద్ధి పెంచుకుని చట్టాలపై అవగాహన కలిగి ఉండల న్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికేటను అందజేశారు.

కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ కోఆరినేటర్ సిహెచ్. కృష్ణను దాకర్, నెహ్రుయువకేంద్ర కోఆర్డినేటర్ యు. మునిమారన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు మంచినీటిని వృధా చేయరాదు

యానాం : యానాం నియోజకవరంలో ప్రజలకు మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవటం జరుగుతుం దని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మలాడి కృష్ణారావు అన్నారు. గత రెండు రోజులుగా యానాం నియోజకవర్గంలో త్రాగు, సాగునీటి ఎద్దడి ఉందటు పలువురు తన దృష్టికి తీసుకురావడంతో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో యానాం నియోజవర పరిధిలోని వాటర్ ట్యాంక్లను, రైతులతో కలిసి పరిచేలను పరిశీలించడం జరిగిం దన్నారు. దీనిపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించి నీటి ఎద్దడి రాకుండ - చర్యలు తీసుకోవడం జరుగుతుంన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నీటి ఎద్దడి రాకుండ అధికారులకు తగిన ఆదేశాలు జారీ - చేయడం జరిగిందన్నారు. అదేమిగా మంచినీటి ఎద్దడి ద ృష్య ప్రజలు నీటిని వృధా చేయకుండా వాడుకోవలని సూచిం చారు.



## శ్రావ్యంగా మధుర గీతాలు

విశాఖపట్నం : స్వర మాధుర్యం, నారీ భేరి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రేమసమాజం ఆడిటోరియంలో మధుర గీతాలు పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని ఊహాలోకంలో విహరింపజేశాయి. నాగేశ్వరి భాగ్యలక్ష్మి పాడిన వలపులోని చిలిపితనం, పుండరీ కుమార్, సి.వి. రాజేశ్వరి పాడిన అది ఒక ఇదిలే, త్యాగరాజు, శైలజా మీరాజ్ పాడిన తీరును కోరిక తీయ తీయగా గీతాలు రస హృదయాలను రంజింపజేశాయి. ఇందులో ఎన్నెన్నో జన్మలబంధం, సిరిమల్లె సొగసు, వీణానాది తీగ నీది, ఓహో గులాబి బాల, ఖుషీ ఖుషీగా నవ్వుతూ వంటి చిత్ర గీతాలు ప్రేక్షకుల్ని ఆద్యంతం మంత్రముగ్ధుల్ని చేసింది. సోమేష్ కీబోర్డుపైన, కరుణా ప్రసాద్, శివ తబలాలపైన, స్టీల్ ప్లాంట్ శ్రీనివాస్ ప్యాడ్స్ పైన చక్కటి సంగీత సహకారంతో ఆకట్టుకున్నారు. తొలుత వి.పి.టి అఫ్.ఏ అండ్ సి.ఏ.ఓ సరగడం శివకుమార్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణ



మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి వీరు మాట్లాడుతూ కళల రాజధానిగా విశాఖ విరాజిల్లుతుందని చెప్పారు. కార్యక్రమంలో విపిటి సహాయ కార్యదర్శి కాసా శ్రీధర్ బాబు, వికసం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, ప్రముఖ కీ బోర్డ్ ప్లేయర్ వి.సీతారామయ్య, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, స్నేహాంజలి వి.ఎన్.మూర్తి, సోషల్ మీడియా సెక్రటరీ సన్ మూర్తి వి.యం.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ ఆసుపత్రిలో
# మహిళ దినోత్సవ వేడుకలు



విశాఖపట్నం: ప్రముఖ తల్లీపిల్లల ఆసుపత్రి అయిన మెడికవర్ ఆసుపత్రి విశాఖపట్నం లో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు వినూతనముగా జరిపారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి స్త్రీ ఈ కార్యక్రమములో బాగస్వామయ్యారు. ప్రతిఒక్కరు ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే థీమ్ అయినటువంటి ఈచ్ ఫర్ ఈక్వల్ కు మద్దతు పలుకుతూ తమ సమూహాన్ని చాటారు. ప్రస్తుత కాలంలో కుటుంబ పోషణ మరియు సంరక్షణలో అనునిత్యం వృత్తి రీత్యా ఒత్తిడికి లోనయ్యే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో తెలియచేస్తూ ఎన్నో స్త్రీకి సంబందిత సాధారణ మరియు అసాధారణ వ్యాధుల గురించి మెడికవర్ ఆసుపత్రి గైనకోలజిస్టులు డాక్టర్ రాధిక , డాక్టర్ విద్యారమా, డాక్టర్ సౌదామిని , డాక్టర్ మాధురి లు తగు సూచనలు సలహాలను అందరికి అందించారు. అలాగే బాల్యావయస్సునుంచి యుక్త వయస్సు వరకు ప్రతి అమ్మాయి / స్త్రీ ఎటువంటి టీకాలు , వైద్య పరీక్షలు చేయుంచుకోవాలో మెడికవర్ పీడియాట్రిటియాన్స్ డాక్టర్ జి.రమా మరియు డాక్టర్ అనిత త్రిపాటి అవగాహనను కల్పించారు. కార్యక్రమం లో భాగంగా స్త్రీ కార్మికులకు నూతన ఉత్తేజాన్ని కలిగించేలా ,సమాజంలో స్త్రీ యొక్క బహుళ పాత్ర, మనుగడ , వికాసం తోపాటు ప్రోత్సాహం మరియు సమానత్వాన్ని చాటేలా పలు సందేశాత్మక ఉదాహరణలు ఆసుపత్రి యజమాన్యమైన శ్రీమతి పద్మజ మరియు శ్యామల అందించారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేయాలి
### కార్యదర్శులకు సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి మోహనరావు



అనంతగిరి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు మరియు పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై...మండల ప్రజా పరిషత్ అధికారి కార్యాలయంలో పంచాయతీ కార్య దర్శులకు సూచనలు ఇస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ పి.మోహనరావు.

# ఎస్‌బిఐ సామాజిక సేవలు అభినందనీయం
### -జెఎన్‌టియుకె విసి ప్రొ.ఎం.రామలింగరాజు

కాకినాడ: సామాజిక సేవలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని జెఎన్‌టియుకె ఉపకులపతి ప్రొ.ఎం.రామలింగరాజు పేర్కొన్నారు. జెఎన్‌టియుకెలో అధ్యాపకులు,విద్యార్థుల అవసరార్థం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.5లక్షలు విలువైన పర్యావరణహిత ఎలక్ట్రిక్ 'బగ్గీ కారు'ను సోమవారం యూనివర్శిటీ అధికారులకు అందజేసింది.బగ్గీ కారును ప్రారంభించిన సందర్భంగా ఉపకులపతి ప్రొ.ఎం.రామలింగరాజు మాట్లాడుతూ ఎస్‌బిఐ తమ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో విద్యార్థులు, సిబ్బందికి మెరుగైన సేవలు అందజేస్తుందన్నారు.ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ బి.వి.ఎస్.కె.టి.భాస్కర్ మాట్లాడుతూ సామాజిక సేవలతో పాటు వ్యవసాయ, వ్యాపార,గృహ రంగాలలో రుణాలు ఇవ్వడానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.సిహెచ్.సత్యనారాయణ, ఓఎస్‌డి ప్రొ.వి.రవీంద్రనాథ్, చీఫ్ ఇంజనీర్ ప్రొ.జి.ఏసు రత్నం, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రొ.జి. అబ్బయ్య,ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొ.వి.శ్రీనివాసులు, ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ గ్రీవెన్సెస్ డైరెక్టర్ ప్రొ.ఏ.స్వర్ణకుమారి, ఎస్‌బిఐ డిజిఎం ఎస్.గిరిధర్, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ డి.రాజా రామ్మోహన్‌రావు, జెఎన్‌టియుకె ఎస్‌బిఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎన్.ఎల్.కె.ఎం.వి.ప్రసాద్, బ్యాంక్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవునికి మంచిముత్యాలు బహుకరణ



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి అమ్మవార్లకు గన్నవరానికి చెందిన అమరవాది. గోవింద రెడ్డి,శ్రీమతి ఉషారాణి దంపతులు శ్రీ స్వామివారి వార్షిక కళ్యాణంలో తలంబ్రాలుగా ఉపయోగించుట కు 001-250-000 గ్రాములు అనగా ఒక కేజీ రెండువందల యాభై గ్రాముల ముత్యాలు ను దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఈవో త్రినాధరావు అభినందించారు.

## వనదుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా ప్రత్యంగిరా హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో పౌర్ణమి సందర్భంగా క్షత్ర రక్షకురాలైన వనదుర్గమ్మవారి ఆలయంలో సోమవారం ఘనంగా ప్రత్యంగిరా హోమం నిర్వహించారు.దుష్ట శక్తులను రక్షించేది, శత్రువుల భాధల నుండి రక్షణ కొరకు సకల కార్యముల యందు విజయం చేకూర్చడానికి నిర్వహించే ప్రత్యంగిరా దేవతా హోమాన్ని లోక శ్రేయస్సు కొరకు,సర్వజనహితం కొరకు దేవస్థానం వారు ఘనంగా ప్రత్యంగిరా హోమం నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరుని పూజ చేసి ప్రత్యంగిరా దేవతా వేద మంత్రాలను పారాయణము చేస్తూ హోమాన్ని చేసారు. అనంతరం వేద మంత్రోఛ్ఛారణలు,మంగళ వాయిద్యాలు నడుమ సుగంధ భరిత ద్రవ్యాలను షోడశోపచార పూజలు చేసి మహా పూర్ణహుతి సమర్పించారు.ఈ కార్యక్రమాలు పురోహితులు చెళ్ళపిళ్ళ.ప్రసాద్ శర్మ,ముత్య. వెంకట్రావు, కొంపెల్ల.మూర్తి,కూచిభట్ల.ప్రసాద్ మరియు వేద పండితులు, వైదిక బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏసి రమేష్ బాబు,ఏఈవో ప్రసాద్ దేవస్థానం అధికారులు,సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు పాల్గొన్నారు.పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాదములు అందజేశారు.

# కరోనా వైరస్‌కు భయపడవద్దు: డా.చప్పిడి



కాకినాడ: కరోనా వైరస్ కోసం భయపడవద్దని...కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని మరియు ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రాక్టీషనర్స్ సొసైటీ అధ్యక్షులు, సామజికవేత్త అలై డా.చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.కాస్మోపాలిటిన్ క్లబ్‌లో రూరల్ మెడికల్ ప్రాక్టీస్‌నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సమావేశంలో డా.చప్పిడి ముఖ్యఅతిథిగా విచ్చేసి కరోనా వైరస్ పై తీసుకోవలసిన జాగ్రత్తలుపై అవగాహన కలిగిస్తూ...గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం,జలుబు, దగ్గు,తుమ్ములు వంటి సమస్యలు వస్తే చేతిరుమాలు అడ్డు పెట్టుకోవడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలన్నారు.ఈ వ్యాధి గాలి ద్వారా వ్యాపించదు,మనవరకు ఈ వ్యాధి రాకపోవచ్చునని భయాందోళనలు చెందవలసిన పనిలేదన్నారు. ఏ వైరస్ అయినపై జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని,అలాగే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించాలన్నారు.గ్రామీణ వైద్యులకు తగు తర్ఫీదు ఇచ్చి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డా.శోభన్ బాబు మాట్లాడుతూ సంఘ పటిష్ఠతకు కృషి చేయాలనీ, అత్యవసర కేసుల జోలికి వెళ్లవద్దని సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి డా.దంగేటి వెంకటరమణ, డా.కృష్ణారావు, డా.కెవివి.సత్యనారాయణ, డా.శ్రీనివాసరావు, వివిధ మండలాల గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

## కోరమండల్ లేడీస్ క్లబ్
## ఘనంగా అంతర్జాతీయ మహిళాదినోత్సవం



కాకినాడ: కోరమండల్ లేడీస్ క్లబ్ వారు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డా.విజయలక్ష్మి విచ్చేసినారు.జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీ గొప్పతనం, సామర్ధ్యం మరియు సమాజంతో, కుటుంబంతో ఎలా నడలవాలనే అంశాలను వివరించి అవహగాహన కల్పించారు.సామజిక సేవలో భాగంగా లేడీస్‌క్లబ్ వారు అర్హులైన దివ్యంగులకు వీల్‌చైర్ సైకిల్, వినికిడి యంత్రం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవరమైన కంచాలు,క్రీడాసామాగ్రి అందచేశారు. కార్యక్రమంలో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ రవికిరణ్, జి.ఎమ్.ఏచ్.ఆర్.పద్మనాభం,యూనియన్ ప్రెసిడెంట్ రాజు,లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ వాసంతి, లేడీస్ క్లబ్ సెక్రెటరీ ఉమాదేవి, ఎచ్.అర్.పి.ఎస్.ఎన్.మూర్తి,అధిక సంఖ్యలో లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి
### ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు నక్కా చిట్టిబాబు వినతి

కాకినాడ: రాష్ట్రంలో ఎస్సీఎస్టీలపై దాడులు అధికమవుతున్నాయని వీటి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టి ,బాధిత కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర కమీషన్ సభ్యులు డా. నరహరి ప్రసాద్‌కు తూర్పుగోదావరి జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు నక్కా చిట్టిబాబు కోరారు.జిల్లాలో ఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు,మండపేటలో యువతిపై జరిగిన అత్యాచారంపై వివరాలను తెలుసుకునేందుకు కాకినాడ ఆర్అండ్ అతిధిగృహానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు డా.నరహరివర ప్రసాదును నక్కా చిట్టిబాబు మర్యాద పూర్వకంగా కలుసుకొని జిల్లాలో దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు,హత్యలపై వివరించారు. దళితులపై దాడులకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించేందుకు రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నా, రోజు రోజుకు ఎస్సీ,ఎస్టీ,దాడులు అధికమవుతున్నాయని,వీటిని శాశ్వత పరిష్కారం చూడాల్సిన అవసరం ఉందని చిట్టిబాబు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు డా.వరప్రసాదను కోరారు.దాడులు జరిగిన నేపథ్యంలో వాటిపై చర్యలు తీసుకోవలసినఅధికారులు కేసులను తారుమారు చేస్తూ తప్పు దోవపట్టించే విధంగా కేసులు నమోదు చేయడం వల్లే దోషులకు సరైన శిక్షలు పడటంలేదని దీంతో దోషులు తప్పించుకు తిరుగుతున్నారని చిట్టిబాబు వివరించారు.గత ఏడాది మేడపాడు బాణా సంచాపేలుడులో ఆరుగురు వ్యక్తులు మృతి చెందారని,వారికి అప్పట్లో ప్రభుత్వం రూ.10లక్షలు నష్టపరిహారం ప్రకటించిందని, అయితే బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పునమాత్రమే అందించారని, మిగిలిన రూ.5లక్షలు ఇప్పించాలని కోరారు. దళితులపై జరిగిన దాదులు, అత్యాచారాలు యథాతరగా అధికారులు కేసులు నమోదు చేసినప్పుడే దోషులకు శిక్షలు పడతాయన్నారు. అగ్రష్టాలకు చెందిన కొందరు వ్యక్తులు దాడులు చేస్తుంటే వారిపై కేసులు పెట్టేందుకు కూడా స్థానికంగా ఉండే అధికారులు భయపడుతున్నారని,కేసులను మార్చిరాస్తున్నారని, దీంతో బాధిత కుటుంబాలకు న్యాయం జరగని పరిస్థితి ఏర్పవుతుందని చిట్టిబాబు వివరించారు.

## హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
### ఉత్తమ సేవా అవార్డు అందుకున్న వైకాపా నేత జమ్మలమడక



కాకినాడ రూరల్: హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ కుళాయి చెరువు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమాజంలో ఉత్తమ సేవలందించిన మహిళలను హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ స్వరూప్ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి వైపా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జమ్మలమడక నాగమణి, లవ్ యు టూ సర్వ ఆర్గనైజర్ ఆర్ బి టి సుందరి,భానుమతి, సుశీ, సుబ్బలక్ష్మి, స్వచ్ఛంద సంస్థ నాయకురాలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మలమడక నాగమణి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమైనదని మహిళ ప్రపంచానికి జీవనాడి అని అన్నారు మహిళలపై అఘాయిత్యాలు ఆనాటి నుండి ఈనాటి వరకు జరుగుతూనే ఉన్నాయన్నారు మహిళలపై రక్షణకు కఠినమైన చట్టాలు రావాలని, హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఫౌండర్ స్వరూప్ తన సంస్థ ద్వారా నిరుపేదలకు పట్టెడన్నం పెట్టే కార్యక్రమాన్ని చేపట్టి మిగిలి ఉన్న ఆహార పదార్థాలను నిరు పేదలకు అందించే కార్యక్రమ0ను ప్రత్యేకించి అభినందనలు తెలియజేశారు.అనంతరం ఫీల్డ్‌తో జమ్మలమడుగు నాగమణి నీ సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను లఘు నాటికలు రూపంలో ప్రదర్శించారు. అంతేకాకుండా వాళ్ళ సంస్థ ద్వారానే 340 మంది వాలంటీర్లు నాగమణి చేస్తున్న సేవా కార్యక్రమాలకు వినియోగించి వలసిందిగా స్వరూప్ కోరారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మహిళా నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాజ్యాంగ అమలును అడ్డుకుంటున్న శక్తులను తిప్పి కొట్టండి...!

కాకినాడ: భారత రాజ్యాంగాన్ని జాతికి అంకితం చేసేందుకు బాబాసాహెబ్ అంబేద్కర్ రెండు సంవత్సరాల 8 నెలల 11 రోజులు శ్రమించి సమకూర్చిన రాజ్యాంగాన్ని కొన్ని దుష్ట శక్తులు అమలు కాకుండా అడ్డుకుంటున్నాయని వాటిని తిప్పికొట్టాలని జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్షుడు,లోటస్ అకాడమి చైర్మన్ ఆలపాటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

స్థానిక లచ్చిరాజు వారి వీధిలోని ఫోరమ్‌ఫర్ ఆర్‌టిఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన ఒక్క రోజు శిక్షణకు, "సమాచార హక్కు చట్టం ఎదుర్కొంటున్న సవాళ్లు" అనే అంశంపై జరిగిన సదస్సునకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ సంపదను సామ్రాజ్యవాద శక్తులకు పాలక ప్రభుత్వాలు దోచి పెట్టడం రాజ్యాంగ విరుద్ధ చర్య అని దీనిని రాజ్యాంగం నిర్వహిస్తుందని ప్రజలు అవగాహన చేసుకుని అలాంటి శక్తులను సమాజం నుండి తరిమేయాలని కోరారు. సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో రావలసిన అవగాహన రాలేదని దానికి కారణం పాలక ప్రభుత్వాలేనని జెఎన్టియుకె ప్రొఫెసర్ దొరస్వామి నాయక్ పేర్కొన్నారు.ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని విభాగాలు ఈ చట్టం పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషిచేయాలని, 14 ఏళ్లలో 14 శాతం మంది కూడా ఈ చట్టం గురించి తెలియకపోవడం విచిత్రమైన విషయం అని అమెరికా వంటి దేశంలో చట్టం ప్రారంభించిన ఏడాది కాలంలోనే 95 శాతం మంది వినియోగించుకున్నారని ఆయన తెలియజేశారు.

# ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు
## కలెక్టర్ మురళీధర్ రెడ్డి

కాకినాడ: కాకినాడ జిల్లాలో పంచాయితీ, మున్సిపల్, జెడ్పీటీసీ,ఎంపిటిసి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, శిక్షణా కార్యక్రమాలు చేపట్టామని జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి తెలియజేశారు.సోమవారం ఉదయం కలెక్టరేట్ స్పందన సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఎన్నికల మీడియా కేంద్రంలో జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లాలోచేపట్టిన చర్యలను వివరించారు.ముందుగా అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను వివరిస్తూ జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేన్లుమినహా మిగిలిన 7 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయితీల ఎన్నికకు ఈనెల 11వ తేదీన ఎన్నికల అధికారులు నోటీసు జారీచేస్తారని, 11వ తేదీ నుండి 13వ తేదీ వరకూ నామినేషన సీకరణ జరుగుతుందన్నారు. మార్చి 14న నామినేషన్ల స్క్రూటినీనిర్వహిస్తారని, 16వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంపహరణకు గడువు ఉంటుందని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఈ నెల23వ తేదీన ఉదయం 7 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకూ నిర్వహిస్తారని, ఓట్ల కౌంటింగ్ ప్రక్రియను ఈ నెల 27వ తేదిఉదయం 8 గం.ల నుండి ప్రారంభించి, లెక్కింపు పూర్తి కాగానే ఫలితాలను ప్రకటిస్తారని తెలియజేశారు. జిల్లాలో ఎసిసి జనరల్‌కు రిజర్వు అయిన ముమ్మిడివరం నగర పంచాయితీ మినహా మిగిలిన అన్ని అర్బన్ స్థానిక సంస్థల చైర్ పర్సన్ పదవులుమహిళలకే రిజర్వు కావడం విశేషమన్నారు. అమలాపురం, తుని, సామర్లకోట, రామచంద్రపురం, పిఠాపురం మున్సిపాలిటీలు,గొల్లప్రోలు నగర పంచాయితీల చైర్ పర్సన్ పదవులు జనరల్ మహిళ కేటగిరికి రిజర్వు కాగా, పెద్దాపురం, మండపేట మున్సిపాలిటీలు, ఏలేశ్వరం నగర పంచాయితీల చైర్ పర్సన్ పదవులు బి.సి మహిళల కేటగిరికి రిజర్వు అయ్యాయన్నారు.మొత్తం 268 వార్డులలో కేటగిరి వారిగా ఎక్స్ జనరల్-10, ఎస్సీ మహిళ-18, ఎస్సీ జనరల్-24, బిసి మహిళ-38, బిసిజనరల్-41, జనరల్ మహిళ-77, జనరల్-60 ఈ 10 అర్బన్ స్థానిక సంస్థలలో మొత్తం 268 వార్డులు ఉండగా మొత్తం1,71,140 మంది పురుషులు, 1,80,986 మంది మహిళలు, 20 మంది ఇతరులు వెరసి 3,52,136 మంది ఓటర్లు ఉన్నారనితెలియజేశారు. వీరి కోసం మొత్తం 436 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, రిజర్వుతో సహా 524 మంది ప్రిసైడింగ్ , మరో524 మంది అసి స్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1568 మంది ఇతర పోలింగ్ అధికారులు, 343 మంది మైక్రో అబ్జర్వర్లనునియమించి అవసరమైన శిక్షణలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 436 పోలింగ్ కేంద్రాలలో 154 సెన్సిటివ్, 132 హైపర్‌సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని ఆయన తెలియజేశారు.గ్రామ పంచాయితీ ఎన్నికల ఏర్పాట్లను వివరిస్తూ జిల్లాలోని 61 మండలాల పరిధిలోని 1103పంచాయితీలకు గాను, 1072 పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. విలీన అంశం పెండింగ్ కారణంగా మండలాలవారిగా రాజమండ్రి రూరల్ పరిధిలో 10, రాజానగరం-6, కోరుకొండ-4, కడియం -1, కాకినాడ రూరల్-6, తుని-4 వెరసి 31పంచాయితీలలో ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. ఎన్నికలు జరిగే పంచాయితీలలో మొత్తం 32,53,837మంది ఓటర్లు ఉండగా, వీరిలో 16,18,930 మంది పురుషులు, 16,33,032 మంది మహిళలు, 425 మంది ఇతరలు ఉన్నారనితెలియజేశారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ సూచనల మేరకు 1072 పంచాయితీలకు రెండు దశలలో ఎన్నికలు నిర్వహిస్తున్నామనిఅమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం డివిజన్లు (30 మండలాలు, 516 గ్రామ పంచాయితీలు, 5960 వార్డులు) పరిధిలోతొలి దశలో ఈనెల 27వ తేదీన, పెద్దాపురం, రామచంద్రపురం, రంపచోడవరం, ఎటపాక డివిజన్ల పరిధిలో (31 మండలాలు,556 గ్రామ పంచాయితీలు, 5822 వార్డులు) పరిధిలో రెండవ దశగా ఈ నెల 29వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. రెండుదశలలో మొతం 12,048 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించనున్నామని, ఇందుకు అవసరమైన బ్యాలెట్ బాక్స్ లనుతమిళనాడు, కేరళ రాష్ట్రాల నుండి సేకరిస్తున్నామని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు 20 శాతం రిజర్వుతో కలిపి 400 మందిస్టేజ్-1 ఆర్ ఓలు, 1300 మంది స్టేజి-2 ఆర్ ఓలు, 14441 మంది పిసైడింగ్ అధికారులు, 29314 మంది ఓపిఓలు వెరసి45,455 మంది సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాలలో 283 -సెన్సిటివ్, 272 -హైపర్ సెన్సిటివ్,11 -



ఇయాక్సిసబుల్, 78-తీవ్రవాద ప్రభావిత గ్రామాలు గుర్తించి అవసరమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.అలాగే ఎన్నికలు జరిగే గ్రామాలను 120 జోన్లు, 438 రూట్లుగా విభజించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు 71,54,00బ్యాలెట్ పేపర్లు అవసరం ఉండగా వీటి ముద్రణకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. పోలింగ్ ప్రక్రియలో వెబ్ కాస్టింగ్‌నిర్వహించనున్నామని, ఇందుకు రాష్ట్ర స్థాయిలో గుర్తించిన ఏజెన్సీతో పాటు, స్థానిక ఇంజనీరింగ్ విద్యార్థుల సేవలను కూడావినియోగించనున్నామని ఆయన తెలిపారు.జడ్ పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ఏర్పాట్లుపై వివరిస్తూ జిల్లాలోని మొత్తం 61 జడ్ పిటిసి స్థానాలకు ఎన్నికలునిర్వహిసుండగా, 1184 ఎంపిటిసి స్థానాలకు గాను 1086 స్థానాలకు ఎన్నికలు జరుతాయన్నారు. గ్రామాల విలీనం, పదవీ కాలంఇంకా ఉండటం తదితర కారణాల వల్ల 98 ఎంపిటిసి స్థానాల్లో ప్రస్తుతం ఎన్నికలు జరగడం లేదన్నారు. మొత్తం 32,54,395మంది ఓటర్లు ఉండగా వీరిలో 18,21,130 మంది పురుషులు, 13,33,265 మంది మహిళలు ఉండగా 3561 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 12,582 బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కు వినియోగిస్తున్నామని తెలిపారు. 1235 సమస్యాత్మక,1317 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రతా ఏర్పాటు చేస్తున్నామని, 117 మంది జోనల్ అధికారులను,380 మంది రూట్ అధికారులను నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్-2 జి.రాజకుమారి, డిఆర్ ఓ సిహెచ్.సత్తిబాబు, ఉపిడినాగేశ్వర నాయక్,జెడ్పీ డిప్యూటీ సిఇవో సుబ్బారావు,నగరపాలక సంస్థ అదనపు కమీషనర్‌నాగనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# వర్సిటీలో పరిశోధనలకు ప్రాధాన్యం

సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌కు ప్రతిపాదన పంపాం

ఇంజనీరింగ్ సీట్లు పెంపుతో విద్యార్థులకు మేలు

- జెనిటిక్ ఇంజనీరింగ్ కోర్సు నిర్వహణకు సెనేట్ ఆమోదం
- వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్ర విశ్వకళాపరిషత్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పరిశోధనలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని, ఆచార్యులు సైతం ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సాధిస్తున్నారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో నిర్వహించిన అకడమిక్ సెనేట్ సమావేశంలో సభ్యులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ ఐఓటి ఏర్పాటు చేయడానికి 115 కోట్లతో ప్రతిపాదనలు పంపామని వివరించారు. ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు పెంపుతో విద్యార్థులకు మేలు జరిగిందన్నారు.

సెనేట్ సమావేశంలో మెత్తం 56 అంశాలపై చర్చించారు. దీనిలో ప్రధానంగా ఎంఏ ఇంగ్లీషు కోర్సులో ప్రవేశాల సంఖ్యను 30 నుంచి 40కి పెంచాలని నిర్ణయించారు. రాష్ట్రంలో పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టిన నేపథ్యంలో ఉపాధ్యాయులను అదనంగా 10 సీట్లు పెంపుదల చేయాలని నిర్ణయించారు. ఆర్కిటెక్చర్ విభాగంలో ఎంప్లానింగ్ కోర్సును ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌తో నిర్వహించాలని నిర్ణయించారు. జెనిటిక్ ఇంజనీరింగ్ కోర్సును, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ నుంచి రక్షణ రంగ ఉద్యోగులకోసం ప్రత్యేకంగా డిఫెన్స్ స్ట్రాటజిక్ స్టడీస్ కోర్సును నిర్వహించాలని, పీజీ డిప్లమో ఇన్ యోగా థెరపి కోర్సును రెండేళ్ల కాలవ్యవధితో పీజీ కోర్సుగా మార్పు చేయాలని సెనేట్ సభ్యులు సూచించారు. హెచ్ఆర్ఎం విభాగాన్ని ఆర్ట్స్ విభాగంలో కొనసాగింపునకు ప్రత్యేకంగా కమిటీని నియమించాలని నిర్ణయం తీసుకున్నారు.

జర్నలిజం విభాగంలో ఎంఏ (కమ్యూనికేషన్, మీడియా స్టడీస్), పీజీ డిప్లమో ఇన్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కోర్సులను, సంగీత విభాగంలో సౌండ్ రికార్డింగ్, ఎడిటింగ్ కోర్సును తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎం.ఏ సోషియాలజీ కోర్సులో 75 శాతం సీట్లు సోషల్‌సైన్స్, హ్యూమానిటీస్‌లో డిగ్రీ చేసిన వారికి 25 శాతం సీట్లు ఏదయినా డిగ్రీ చేసిన వారికి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. న్యాయ కళాశాలలో నిర్వహిస్తున్న ఎం.ఏ హ్యూమన్ రైట్స్ అండ్ డ్యూటీస్ కోర్సును సోషియాలజీ విభాగానికి అనుసంధానం చేయాలని సూచించారు. ఐదేళ్ల న్యాయ విద్యలో మూడేళ్లు పూర్తిచేసిన వారికి బ్యాచిలర్ ఆఫ్ అకడమిక్స్ లా డిగ్రీని అందించాలని నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించే ఆచార్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సెనేట్ సభ్యులు కొందరు కోరారు. వర్సిటీ ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయానికి సెనేట్ సభ్యులంతా నైతికంగా మద్దతును ఇస్తామని స్పష్టం చేశారు.

సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, మాజీ వీసీలు ఆచార్య కె.వి రమణ, వై.సి సింహాద్రి, బీల సత్యనారాయణ, జి.ఎస్.ఎన్ రాజు, జి.నాగేశ్వర రావు, సెనేట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్లినికల్ ట్రయల్స్‌లో రొమ్ముకేన్సర్ ఔషధం

## గీతంలో అమెరికా వైద్య నిపుణుడు వెల్లడి



సాగర్‌నగర్ : కేన్సర్ చికిత్సకు అవసరమైన ఔషధాన్ని తయారు చేయడంలో పురోగతి సాధించామని ప్రస్తుతం క్లీనికల్ ట్రయల్స్ దశలో ఉన్నామని అమెరికాలోని నేషనల్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ అధిపతి డాక్టర్ స్టాన్లీ లిప్‌కోవిజ్ తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టి ట్యూట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆన్ ది ట్రయిల్ టూ టార్గెట్ థెరిపీ ఆఫ్ బ్రెస్ట్ కేన్సర్ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కేన్సర్ చికిత్స సమయంలో కేన్సర్ కణాలపై ఉపయోగించే ఔషధాలు వాటి పక్కనే ఉండే ఆరోగ్యకరమైన కణాలను దెబ్బతీయకుండా ఔషధాలు పనిచేయాలన్నారు. ఈ దిశగా తాము జరిపిన అధ్యయనాల ద్వారా మెడి- 3039, ఓఎన్‌సి-201 ఔషధాలు కేవలం కేన్సర్ కణాలపై మాత్రమే పనిచేస్తాయని గుర్తించామన్నారు. టార్గేట్ థెరిపీగా పేర్కొనే ఈ వైద్య విధానం ద్వారా రొమ్ము కేన్సర్‌కు జరిపే చికిత్స క్లీనికల్ ట్రయిల్స్‌లో ఫలితాలను ఇస్తోందని వెల్లడించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో కేన్సర్ బారిన పడుతున్నవారి సంఖ్య ఏటా పెరుగుతోందని అలాంటి వారికి ఈ పరిశోధనల ఫలితాలు కొత్త జన్మను ఇవ్వగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్టాన్లీ లిప్‌కోవిజ్‌ను వైస్ ఛాన్సలర్ సన్మానించారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ కె.వి.జి.డి. బాలాజీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఎమ్.శరత్‌చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



మహిళల భద్రతే ధ్యేయంగా

# దిశా పోలీస్ స్టేషన్ల ప్రారంభం

## సీపీ ఆర్.కె. మీనా



మధురవాడ : మహిళల భద్రతే ధ్యేయంగా దిశా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని విశాఖ పోలీస్ కమిషనర్ ఆర్.కె మీనా అన్నారు. ఎండాడ ఏసీపీ కార్యాలయ సమీపంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన దిశా పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళల రక్షణకై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన దిశ యాక్ట్‌ను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా దినోత్సవం రోజున ప్రత్యేక మహిళా దిశా పోలీస్ స్టేషన్ విశాఖ నగరంలో ప్రారంభించుకోవడం మహిళా సిబ్బందికి మరియు మహిళలకు ఎంతో గౌరవ ప్రదమని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు తమ బాధను వివరించుకునేందుకు అనువుగా అత్యధికంగా మహిళా సిబ్బందిని స్టేషన్లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

మరో అతిథి జిల్లా జడ్జీ డి.ఎస్ భానుమతి మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకంగా దిశా యాక్ట్ మరియు దిశా పోలీస్ స్టేషన్‌లు ప్రారంభించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. పోలీస్ సిబ్బంది ఫిర్యాదుదారుల సమస్యలను తమ సమస్యలుగా భావించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏయు విసి ప్రసాద్ రెడ్డి, డి.సి.పి-1 రంగారెడ్డి, డి.సి.పి-2 విజయ్ భాస్కర్, దీవిస్ డైరెక్టర్ రావు, నార్త్ ఎసిపి ఎ.రవిశంకర్ రెడ్డి, పి.యమ్. పాలెం సి.ఐ రవికుమార్, వివిధ శాఖల పోలీస్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐసీసీ అత్యుత్తమ

# వరల్డ్‌కప్ జట్టు ఇదే..

## టీమిండియా నుంచి ఇద్దరు..

దుబాయ్: మహిళల టీ-20 వరల్డ్‌కప్ ట్రోఫీని ఆసీస్ కైవశం చేసుకోగా, భారత్ రన్నరప్‌గా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఆసీస్ మరోసారి కప్‌ను కైవశం చేసుకుని ఐదోసారి విజేతగా నిలిచింది. దీనిలో భాగంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)తమ అత్యుత్తమ వరల్డ్‌కప్ టోర్నమెంట్ జట్టును ప్రకటించింది. ఈ మెగా టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 12 మంది వుమెన్ క్రికెటర్లను ఎంపిక చేసింది. ఈ జట్టుకు ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసిన ఐసీసీ.. భారత్ నుంచి ఇద్దరికి మాత్రమే చోటు కల్పించింది. ఇందులో స్పిన్నర్ పూనమ్ యాదవ్ కు ఐసీసీ ఎలెవన్ జాబితాలో చోటు దక్కగా, 12వ క్రీడాకారిణిగా షెఫాలీ వర్మను ఎంపిక చేసుకుంది. ప్రధానంగా వరల్డ్‌కప్ గెలిచిన ఆసీస్ జట్టు నుంచి ఐదుగురు క్రికెటర్లకు తమ జట్టులో చోటిచ్చిన ఐసీసీ.. ఇంగ్లండ్ నుంచి నలుగుర్ని తీసుకుంది. దక్షిణాఫ్రికా జట్టు నుంచి ఒక క్రీడాకారిణికి మాత్రమే అవకాశం కల్పించింది.

**ఐసీసీ వరల్డ్‌కప్ టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్ ఇదే..**

మెగ్ లానింగ్ (కెప్టెన్) (ఆస్ట్రేలియా), అలెసా హీలీ (వికెట్ కీపర్) (ఆస్ట్రేలియా), బెత్ మూనీ (ఆస్ట్రేలియా), నాట్ స్కీవర్ (ఇంగ్లండ్), హీథర్ నైట్ (ఇంగ్లండ్), లౌరా వాల్వార్డ్ (దక్షిణాఫ్రికా), జెస్ జొనాసేన్ (ఆస్ట్రేలియా), సోఫీ ఎక్సలీస్టోన్ (ఇంగ్లండ్), అన్యా ష్రబ్‌సోల్ (ఇంగ్లండ్), మెగాన్ స్కట్ (ఆస్ట్రేలియా), పూనమ్ యాదవ్ (భారత్), షెఫాలీ వర్మ (భారత్, 12వ మహిళ).

వైసీపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసి

# పార్టీకి విజయాన్ని చేకూర్చాలి

## విశాఖ ఎంపి ఎం.వి.వి సత్యనారాయణ

## ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె. రాజు



కంచరపాలెం: వైసీపీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి కార్యకర్త, వార్డు నాయకులు పార్టీ విజయానికి కృషి చేయాలని విశాఖ ఎంపి ఎం .వి .వి సత్యనారాయణ పిలుపునిచ్చారు.

ఈమేరకు జీవీఎంసీ 39వ వార్డు పరిధి మాధవధార ప్రాంతం మాధవ స్వామి కళ్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా కార్యకర్తలకు కొన్ని సూచనలు చేశారు . కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు మాట్లడుతూ త్వరలో జగనన్న జీవీఎంసీ ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థి ఎవరైనా విజయానికి ప్రతి ఒక్కరూ పనిచేసి జీవీఎంసీ మేయర్ పీఠాన్ని వైకాపా పొందేలా చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు రొంగలి జగన్నాథం , తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం

## శారదాపీఠ ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

## పశ్చిమలో హిందూ ధర్మ ప్రచార యాత్ర ప్రారంభం

గుంటూరు : విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి చేపట్టిన హిందూ ధర్మ ప్రచార యాత్ర పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రారంభమైంది. ఈనెల 14వ తేదీ వరకు ఆరు రోజులపాటు హిందూ ధర్మ ప్రచార యాత్ర జిల్లాలో సాగుతుంది. సోమవారం ఉదయం ఏలూరులోని జరాపహేశ్వరస్వామి ఆలయ సందర్శనతో యాత్రకు శ్రీకారం చుట్టారు స్వామి స్వాత్మానందేంద్ర. తొలుత జగద్గురు శంకరాచార్యులు ప్రతిష్టించిన మహిషాసురమర్దని అమ్మవారిని దర్శించుకున్నారు.

అనంతరం జరాపహేశ్వరుని ఆలయ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నంది విగ్రహం యొక్క ప్రాశస్త్యం గురించి పండితులను అడిగి తెలుసుకున్నారు స్వామీజీ. దేవస్థానం అధికారులు స్వామీజీ ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటించారు.

అనంతరం శనివారపుపేటలోని పురాతన చెన్నకేశవస్వామి ఆలయాన్ని స్వామీజీ సందర్శించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్వామీజీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఇప్పటికే హిందూ ధర్మ ప్రచార యాత్రను తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాల్లో పూర్తి చేసినట్లు స్వామీజీ చెప్పారు. జగద్గురు శంకరాచార్య సంప్రదాయాన్ని విశాఖ శ్రీ శారదాపీఠం పాటిస్తోందన్నారు. పూజ్యగురువులు, విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి ఆదేశాలతో ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు.



ఇంటర్నేషనల్ ఉమెన్స్‌డే సందర్భంగా

## రైల్వే స్టేషన్‌లో మహిళా కార్మికులు, రైల్వే కాలనీ మహిళల సమావేశం



కడప : రైల్వే ఇన్స్టిట్యూట్‌లో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా మహిళా కార్మికులు మరియు రైల్వే కాలనీ మహిళలతో సమవేశం ఏర్పాటు చేయడమైనది. దీనికి సుమారు 80 మంది మహిళలు ఉత్సాహంగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మొట్ట మొదట మహిళా సమావేశాన్ని ఏర్పాటు చేసినందుకు మహిళలు అందరు కడప రైల్వే ఇన్స్టిట్యూట్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథి శీరిష మాట్లాడుతూ మనమందరము ఆత్మవిశ్వాసముతో మన సమస్యలు మనమే పరిష్కరించుకుని ఎంతో ఎత్తుకు ఎదగాలని పీలుపు నిచ్చారు.

మరియు గెస్ట్ అఫ్ ఆనర్‌గా బి. ప్రశాంతి మాట్లాడుతూ మనము నెల నెల కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ఆటలు, పాటలు, పోటీలు నిర్వహించి మన మందరము మానసిక, ఉల్లాసంగా గడుపుదాం అని పిలుపునిచ్చారు.

మరో అతిధి ఎల్.లక్ష్మి ప్రసంగిస్తూ మన ఆరోగ్యము పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండి ఆరోగ్యాన్ని కాపుడుకుందాం అని పిలుపు నిచ్చారు.

గెస్ట్ అఫ్ ఆనర్ గీత మాట్లాడుతూ మహిళా కార్మికులు వీధి నిర్వహణలో పురుషులతో పోటీపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.



# హోళి పండగ సందర్భంగా గౌరవ ఉపరాష్ట్రపతి సందేశం

న్యూఢిల్లీ : రంగుల కేళి.. హోళి సందర్భంగా దేశ ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు. వసంత రుతువు ఆగమనానికి, ప్రకృతిలో కొత్త సొగసుకు ప్రతీకగా జరుపుకునే ఈ పండగ.. కుటుంబం, బంధుమిత్రుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, ఐకమత్యం, సోదరభావాన్ని పెంపొందిస్తుంది. చెడుపై మంచి సాధించే విజయానికి గుర్తుగా హోళికా రాక్షసిని దహించే హోళి మంటల్లో (కాముని దహనం) మనలోని చెడు కోరికలను, ద్వేషభావాన్ని, బాధలను దహించివేద్దాం.

హక్కులతోపాటు బాధ్యతలను గుర్తెరిగి సమసమాజ స్థాపనకు తద్వారా నవభారత నిర్మాణానికి కృషిచేస్తామని ఈ పండగ సందర్భంగా ప్రతినబూనుదాం. సమాజంలో కుల, మత, లింగ వివక్షతలను, సామాజిక దురాచారాలను రూపుమాపి శాంతి, సామరస్యాలను పెంపొందించడంలో మనపాత్రను సమర్థవంతంగా పోషిద్దాం.

సుఖం, దుఃఖం, సంతోషం, విచారం.. వీటన్నిటి మేలు కలయికే జీవితం అని చెప్పే ఈ వసంతోత్సవం మీ జీవితాల్లో సుఖశాంతులు నింపాలని కోరుకుంటున్నాను. మరోసారి మీ అందరికీ హోళి శుభాకాంక్షలు.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com